PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 268 | విజయవాడ, గురువారం 1 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 1 May 2025 | Rs



చాహల్ హ్యాట్రిక్

- చెన్నైపై పంజాబ్ అలవోక విజయం
- ప్లే-ఆఫ్స్ రేసునుంచి సూపర్‌కింగ్స్ నిష్క్రమణ

8



నేడు మేడే

కార్మికవర్గ దీక్షా దినం

అణచివేత, దోపిడిలపై పోరాటాన్ని కొనసాగిస్తామని కార్మికవర్గం ప్రతిన బూనే రోజు ఎర్రజెండా సందేశం.. సమరనాదమై పోరుగీతమౌతుంది !

మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్స్ రద్దుకై ఉద్యమం ..ప్రత్యేక వ్యాసం 4లో

జనగణనతో పాటే కులగణన

- కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం
- పతిపక్షాల డిమాండ్‌కు దిగొచ్చిన కేంద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కులగణనపై కేంద్ర మంత్రివర్గం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిపక్షాలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న దేశవ్యాప్త కులగణనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయించింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సిసిపిఎ నిర్ణయాలను వెల్లడించారు. వచ్చే జనాభా లెక్కలతోపాటే కులగణన చేపట్టాలని నిర్ణయం సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే దేశంలో కొన్ని రాష్ట్రాలు కులగణన చేపట్టాయని, అయితే వీటిలో కొన్ని రాష్ట్రాలు కులగణను రాజకీయ సాధనంగా వాడుకున్నాయని మంత్రి ఆరోపించారు. కుల గణన నిర్ణయం తమ ప్రభుత్వం సమాజం, దేశ విలువలు, ప్రయోజనాలకు కట్టుబడి ఉందని నిరూపిస్తుందన్నారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలనే ప్రతిపక్షాల డిమాండ్‌పై చర్చించేందుకు బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిపిఎ) సమావేశమైంది.



చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3550

చెరకు మద్దతు ధర క్వింటాలుకు రూ. 355గా (టన్ను రూ.3550) సిసిఇఎ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2025-26 చక్కెర సీజన్ (అక్టోబర్ - సెప్టెంబర్)లో చెరకుకు న్యాయమైన, లాభదాయక ధర (ఎఫ్ఆర్పి)ను రూ.355గా ఆమోదించినట్లు చెప్పారు. 10.25 శాతం కంటే ఎక్కువ రికవరీలో ప్రతి 0.1 శాతం పెరుగుదల క్యూటిఎల్‌కు రూ.3.46 ప్రీమియంను అందిస్తుందని, రికవరీలో ప్రతి 0.1 శాతం తగ్గుదలకు క్యూటిఎల్‌కు రూ.3.46ని తగ్గిస్తుందని చెప్పారు. అయితే, చెరకు రైతుల వడ్డీని కాపాడే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 9.5 శాతం కంటే తక్కువ రికవరీ ఉన్న చక్కెర మిల్లుల విషయంలో ఎటువంటి తగ్గింపు ఉండకూడదని సిసిఇఎ నిర్ణయించినట్లు తెలిపారు.

'కుల గణన' మా విజయమే : కాంగ్రెస్, ఆర్‌జెడి

దేశవ్యాప్తంగా కుల గణనకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం తమ విజయమేనని బుధవారం కాంగ్రెస్, ఆర్‌జెడి వేర్వేరుగా ప్రకటనలు చేశాయి. ఈ రెండు పార్టీలు కూడా కేంద్రాన్ని కులగణనకు తలొగ్గేలా చేయడంలో తాము విజయం సాధించామని ప్రకటించాయి. బీహార్‌లో కుల గణన జరగడానికి, ఇప్పుడు దేశవ్యాప్త కులగణనకు కేంద్రం ఒప్పుకోవడానికి తమ పోరాటమే పని చేసిందని తెలిపాయి.

సింహాచలంలో ఘోరం

చందనోత్సవానికి వచ్చిన భక్తులపై గోడ కూలి ఏడుగురు మృతి

విచారణకు త్రిసభ్య కమిటీ... మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు : సిఎం ఆదేశం

- రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత : వైఎస్ జగన్
- రూ.కోటి పరిహారం ప్రకటించండి : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో. అమరావతి బ్యూరో

విశాఖపట్నం జిల్లా సింహాచలం సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో ఘోర దుర్గటన చోటుచేసుకుంది. ఏటా జరిగే చందనోత్సవంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి అప్పన్న నిజరూపాన్ని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు కొండపైకి వచ్చారు. భారీ వర్షం కురవడంతో బుధవారం తెల్లవారుజామున ఇటీవలే నిర్మించిన ఒక గోడ కూలి 300 రూపాయల క్యూలైన్‌పై పడటంతో అక్కడికక్కడే ఏడుగురు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. ఒకరికి గాయాలయ్యాయి. కొండపై బస్టాండ్ ఎదురుగా వైకుంఠ ద్వారం వైపు ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ దుర్ఘటనపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాదానికి కల కారణాలను వెలికితీసేందుకు త్రిసభ్య కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి 25 లక్షల నష్టపరిహారం అందించాలని ఆయన ఆదేశించారు. బుధవారం సాయంత్రం విశాఖకు వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుర్గటనకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యతని అన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ప్రకటించాలని, ప్రమాదానికి కారణమైన గోడను నిర్మించిన కాంట్రాక్టరు, పనులను పర్యవేక్షించిన అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది.



ఘటనా స్థలంలో సహాయక చర్యలు

ఏం జరిగింది...?

బుధవారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో సింహాచలంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది, ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో ఇటీవలే నిర్మించిన రిటైనింగ్ గోడ (వాల్) కూలిపోయింది. ఏం జరుగుతుందో అర్థం చేసుకునే లోపే భక్తులు గోడ శిథిలాల కింద చిక్కుకున్నారు. బాధితుల, మిగిలిన యాత్రికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. అక్కడికి సమీపంలోనే ఉన్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది, కొద్దిమంది అధికారులు హుటాహుటిన ఘటనా స్థలివద్దకు చేరుకున్నారు. కూలిన గోడ కింద చిక్కుకున్న వారిని బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టారు. హుటాహుటిన జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, హోం మంత్రి అనిత అక్కడకు చేరుకుని అంబులెన్సులు రప్పించి శిధిలాల కింద చిక్కుకున్న వారిని కెజిహెచ్‌కు తరలించారు. ఎండ వేడిమిని తట్టుకోడానికి గోడపై నుంచి వేసిన రేకులు, ఐరన్ పైపుల షెడ్లు కూడా ఈదురుగాలుల ధాటికి గోడపై పడిపోయాయని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఘటనా స్థలం వద్ద బుధవారం తెల్లవారుజామున వెల్లడించారు.

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు...

మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో మధురవాడ చంద్రంపాలేనికి చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ, ఆమె తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జరి మహాలక్ష్మి ఉన్నారు. సాయంత్రం 4 గంటలకు కెజిహెచ్ వద్ద ఏడు మృతదేహాలకూ పోస్టు మార్టం నిర్వహించి వారి వారి బంధువులకు అప్పగించారు.

హడావుడిగా గోడ పూర్తిచేశారు...

సుమారు 10 అడుగుల ఎత్తు ఉండే ఈ రిటైనింగ్ వాల్ (గోడ) నిర్మాణాన్ని మిగతా 7లో

మృతుల వివరాలు

1. పత్తి దుర్గాస్వామినాయుడు (29) మాచవరం తూర్పుగోదావరి జిల్లా,
2. ఎడ్ల వెంకటరావు (60) అడవివరం విశాఖపట్నం జిల్లా,
3. కుమ్మపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు(28) మాచవరం తూర్పుగోదావరి జిల్లా.
4. గుజ్జరి మహాలక్ష్మి (65) హెచ్‌బికాలనీ వెంకోజీపాలెం (విశాఖపట్నం)
5. పైలా వెంకటరత్నం (45), ఉమానగర్ వెంకోజీపాలెం,
6. పిళ్లా శైలజ (26) చంద్రంపాలెం మధురవాడ (విశాఖపట్నం),
7. పిళ్లా ఉమా మహేశ్వరరావు చంద్రంపాలెం మధురవాడ (విశాఖపట్నం)

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

ఐదుగురు మెడికోలు సహా ఆరుగురు దుర్మరణం

ప్రజాశక్తి- కోవూరు (నెల్లూరు జిల్లా)

కారు అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో, కారులోని ఐదుగురు మెడికోలు, ఇంటి యజమాని సహా ఆరుగురు దుర్మరణం చెందారు. నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద బుధవారం జరిగిన ఘోర ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు ఆరుగురు విద్యార్థులు బుచ్చిరెడ్డిపాలెంలోని ఓ స్నేహితుడి అక్క సీమంతం ఫంక్షన్‌కు కారులో వెళ్లి నెల్లూరుకు తిరిగి వస్తున్నారు. పోతిరెడ్డిపాలెం హైవేపై అతివేగంగా వెళ్తుండగా కారు అదుపు తప్పి చిన్నమట్టి గుంతపై ఎక్కింది. అనంతరం రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఆ ఇంట్లో నిద్రిస్తున్న ఇంటి యజమాని నిడిగుంట రమణయ్య (60)పైకి కారు దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కారులోని ఆరుగురు మెడికోలూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఇద్దరిని నగరంలోని నారాయణ ఆస్పత్రికి, మరో ఇద్దరినిని రామచంద్రా రెడ్డి ప్రజావైద్యశాలకు, ఇంకో ఇద్దరిని జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అనంతపురానికి చెందిన అభిషేక్ రాజు(22), అదే జిల్లా ధర్మవరానికి చెందిన నరేష్ (22), తిరుపతికి చెందిన అభిసాయి (22), నెల్లూరు జిల్లా సంగం మండలం సిద్ధీపురానికి చెందిన జీవన్ (22), ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన విఘ్నేష్ (22) ఉన్నారు. మరో విద్యార్థి మౌనిత్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్‌పి సౌజన్య, ఆర్‌డిఒ అనూష, రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు, తహశీల్దార్ నిర్మలానంద బాబా, కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు అయింది.



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలి : వి.శ్రీనివాసరావు

ఈ ఘోర ప్రమాదం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాదిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

జాతీయ భద్రతా సలహా బోర్డు చైర్మన్‌గా అలోక్ జోషి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఎబి)ని కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఎన్ఎస్ఎబి చైర్మన్‌గా రా మాజీ చీఫ్ అలోక్ జోషిని చైర్మన్‌గా నియమించారు. మోడీ హయంలో ఎన్ఎస్ఎబిను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌కు ఈ బోర్డు దేశ భద్రతా వ్యవహారాలపై సలహాలు, సిఫార్సులను అందించే ఉన్నత స్థాయి సంస్థగా పనిచేయనుంది. ఈ బోర్డులో మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటారు. త్రివిధ దళాల మాజీ అధికారులు, ఇద్దరు మాజీ ఐపిఎస్‌లు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని సభ్యులుగా నియమించారు. సైనిక సేవల నుంచి పదవీ విరమణ పొందిన మాజీ వెస్ట్రన్ ఎయిర్ కమాండర్ ఎయిర్ మార్షల్ పిఎం సిన్హా, మాజీ సదరన్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఎకె సింగ్, రియర్ అడ్మిరల్ మాంటీ ఖన్నా సభ్యులుగా నియమితులయ్యారు. అలాగే, ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) నుంచి పదవీ విరమణ పొందిన రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, ఐఎఫ్ఎస్ మాజీ అధికారి బి. వెంకటేష్ వర్మ నియామకం అయ్యారు.

డిజిటల్ యాక్సెస్ ప్రాథమిక హక్కు

- జీవించే హక్కులో ఇదీ అంతర్భాగమే : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : డిజిటల్ యాక్సెస్ అనేది ప్రాథమిక హక్కని, జీవించే హక్కులో ఇది కూడా అంతర్భాగమేనని సుప్రీం కోర్టు బుధవారం పేర్కొంది. డిజిటల్ యాక్సెస్ అన్నది ప్రాథమిక హక్కు, గ్రామీణ ప్రాంతాల్లోని వారు, సమాజంలో అట్టడుగు వర్గాల వారితో సహా ప్రతి ఒక్కరికీ డిజిటల్ యాక్సెస్‌బిలిటీని ప్రభుత్వం కల్పించాలని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. (డిజిటల్ యాక్సెస్ అంటే డిజిటల్ సాంకేతికతలు, ఇంటర్‌నెట్, కంప్యూటర్లు, వంటి వనరులు అందరికీ అందుబాటులో వుండేలా, వాటిని వారు వినియోగించుకునేలా చూడడం).

సమాజంలో వెనుకబాటుకు గురైన, అట్టడుగు వర్గాలకు చెందినవారు, వికలాంగులు, అందరికీ డిజిటల్ ఎకో వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని జస్టిస్ జె.బి.పార్ధివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన బెంచ్ రూలింగ్ ఇచ్చింది. నో యువర్ కస్టమర్ (కెవైసి) ప్రక్రియను మెరుగుపరిచేందుకు, అందరికీ మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈ సందర్భంగా ప్రభుత్వానికి 20మార్గదర్శకాలు జారీ చేసింది. ఆధార్, ఆన్‌లైన్ సర్వీస్, డెలివరీ ప్లాట్‌ఫారమ్‌లు, నెట్ బ్యాంకింగ్ ఇలా భారతదేశంలో డిజిటల్ పురోగతి విస్తృతంగా సాగుతున్న నేపథ్యంలో అసలు ఈ సాంకేతికతలు నిజంగా అందరికీ చేరువవుతున్నాయా లేదా అనే కీలకమైన అంశం పరిశీలనకు నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురవుతోందని కోర్టు అభిప్రాయపడింది.



జీవించే ప్రాథమిక హక్కు, మరియు స్వేచ్ఛా హక్కులోనే డిజిటల్ యాక్సెస్ హక్కు అనేది అంతర్భాగంగా వుంటుందని తీర్పు రాసిన జస్టిస్ మహదేవన్ పేర్కొన్నారు. కేవలం మిగతా 7లో

కాంగ్రెస్ కార్యాలయంపై బిజెవైఎం దాడి యత్నం

- ఆరుగురు అరెస్ట్
- షర్మిల రాజధాని పర్యటనను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌పై దాడిచేయడానికి భారతీయ జనతా యువ మోర్చా (బిజెవైఎం) నాయకులు బుధవారం ప్రయత్నించారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కార్యాలయంలోనే విలేకర్ల సమావేశంలో మాట్లాడుతుండగా ఈ సంఘటన చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. పిసిసి కార్యాలయంలోకి చొరబడుతున్న వీరిని కాంగ్రెస్ కార్యకర్తలు గుర్తించి అడ్డుకున్నారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకుని బిజెవైఎం కు చెందిన వారిని పిసిసి కార్యాలయం నుండి బయటకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో అక్కడ తోపులాట చోటుచేసుకుంది. కాంగ్రెస్ కార్యాలయంపై దాడికి మోర్చా నాయకులు తమ వెంట తెచుకున్న కొడిగుడ్లు, టమోటోలు కింద పడి ధ్వంసం అయ్యాయి. బిజెపికి, ప్రధానికి అనుకూలంగా నినాదాలు చేస్తూ బిజెవైఎం నాయకులు పిసిసి కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించే ప్రయత్నం చేశారు. దీంతోయువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీతో పాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అంతకుముందు బుధవారం ఉదయంతన నివాసం నుండి అమరాతిలోని ఉద్దండ్రాయుని పాలెం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోడీ గతంలో శంకుస్థాపన చేసిన ప్రాంతానిక వెళ్లడానికి షర్మిల సిద్ధమయ్యారు. ఈ విషయం తెలియడంతో పోలీసులు ఆమెను హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో ఆ ప్రయత్నం మానుకుని, ఆమె పోలీసుల బందోబస్తు మధ్యే పిసిసి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతుండగా బిజెవైఎం నాయకులు దాడికి యత్నం చేశారు. దీంతో ఆమె కొద్దిసేపు పిసిసి కార్యాలయ గేటు వద్ద మిగతా 7లో



ఆందోళన చేస్తున్న పిసిసి ఛీఫ్ షర్మిలమ్మ

పసిడి డిమాండ్‌కు ధరాఘాతం

- అమ్మకాల్లో 15 శాతం పతనం
- అభరణాల విక్రయాల్లో 25 శాతం క్షీణత
- వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వెల్లడి

పరిశోధనలు రైతులకు చేరువ కావాలి

- పెట్టుబడి వ్యయం తగ్గింపు అవసరం
- ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు
- ముగిసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకలు

3

రేపే రాజధాని పనుల పున: ప్రారంభం

- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు
- లక్షన్నర మందితో సభ
- వేదికపై 14 మందికి అవకాశం?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులు రేపు (శుక్రవారం) పున: ప్రారంభం కానున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాల్గొనే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభకు దాదాపు లక్షన్నర మందికిపైగా హాజరవుతారని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో సభా వేదిక వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్పిజి) ఇప్పటికే అమరావతి చేరుకుని తనిఖీలు పూర్తిచేసింది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ప్రధానమంత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో రాష్ట్ర సచివాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న రాజధాని పనుల పున:ప్రారంభ వేదిక వద్దకు వస్తారు. బహిరంగ సభ వేదికపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో పాటు 14 మంది ఉంటారని అధికారులు చెబుతున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రులు కె రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పురపాలక శాఖమంత్రి పి నారాయణ, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధ్వేరి వేదికపై ఉంటారని అంటున్నారు. వేదిక ముందు రాజధాని రైతులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాజధాని అమరావతిలో చేపట్టే రూ.49,040 కోట్ల పనులతో పాటు పలు కేంద్రప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన చేయనున్నారు. శాశ్వత హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ, నాయమూర్తులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్ అధికారుల గృహ సముదాయం నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేస్తారు. రూ.57,962 కోట్లతో డిఆర్‌డిఏ, డిపిఐఐటి, ఎన్‌హెచ్ఏఐ, రైల్వే ప్రాజెక్టులు, నాగాయలంకలో దాదాపు రూ.1500కోట్లతో మిసైల్ టెస్ట్ రేంజ్‌కు, విశాఖలో కేంద్రప్రభుత్వం నిర్మించే యూనిటీమాల్‌కు, రూ.293కోట్లతో గుంతకల్ వెస్ట్ నుంచి మల్లప్ప గేట్ వరకు చేపట్టిన రైల్వే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. మరో రూ.3176కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. రూ.3680 కోట్ల విలువైన పలు జాతీయ రహదారుల పనులను ప్రారంభిస్తారు. రూ.254కోట్లతో మిగతా 7లో



రాజధాని పున:ప్రారంభ సభకు ముస్తామవుతున్న వేదిక

సింహాచలం ఘటనపై మోడీ సంతాపం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నంలో గోడ కూలి జరిగిన ఘటనలో ప్రాణనష్టం చాలా బాధాకరమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. బుధవారం ప్రధాని మోడీ ఎక్స్‌లో స్పందించారు. మృతులకు తీవ్ర సంతాపం ప్రకటించిన ఆయన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు అందిచనున్నట్లు ప్రకటించారు.

అంగన్‌వాడీ సెంటర్లకు మే నెల అంతా వేసవి సెలవులివ్వాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో అమల్జేస్తున్నట్లుగా రాష్ట్రంలో కూడా అంగన్‌వాడీ సెంటర్లు, మినీ వర్కర్లకు కూడా మే నెల అంతా వేసవి సెలవులివ్వాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బారావమ్మ బుధవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా ఉందని, అంగన్‌వాడీ సెంటర్లకు వస్తున్న ప్రీస్కూల్ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు కూడా ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

అధునాత హజ్ హౌస్‌ను నిర్మిస్తాం : హసన్ బాషా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధునాతన హజ్ హౌస్‌ను నిర్మిస్తామని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా తెలిపారు. ఎపి హజ్ కమిటీ మొదటి సమావేశం, ఛైర్మన్ ఎన్నిక విజయవాడలోని హజ్ కమిటీ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా హజ్ కమిటీ నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన హసన్ బాషా మాట్లాడుతూ.. హజ్ కమిటీ ఆధ్వర్యంలో యాత్రీకులకు సేవా భావంతో ఉత్తమ సేవలు అందిస్తామని చెప్పారు. హజ్ కమిటీ ఛైర్మన్ ఎన్నికకు ఎన్నికల అధికారి, మైనార్టీ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ఎల్ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. మొత్తం 13 మంది సభ్యులలో 10 మంది సభ్యులు సమావేశానికి హాజరవగా, మొదట పఠాన్ ఖాదర్ అలీ ఖాన్ ఛైర్మన్ అభ్యర్ధిగా షేక్.హసన్ బాషాను ప్రతిపాదించగా, మీర్జా అబిద్ హుస్సేన్ బేగ్ ప్రతిపాదనను బలపరిచారు. మిగిలిన సభ్యులు అందరూ దీనికి మద్దతుగా తమ ఆమోదాన్ని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యమే: లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైఫల్యం వల్లే సింహాచలంలో గోడకూలి ఎనిమిది మంది మృతిచెందారని వైసిపి ప్రధాన కార్యదర్శి లక్ష్మీ పార్వతి తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో అవినీతి వ్యవహారంతో భక్తులను బలితీసుకున్నారని ఆమె పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు దేవుడిని రాజకీయాలకు వాడుకోకూడదని, చంద్రబాబు పవన్ కల్యాణ్ ఇకనైనా అర్థం చేసుకోవాలని, వారి చర్యల వల్లే ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

గిరిజన నిరుద్యోగుల ఐటిడిఎ ముట్టడి

- స్పెషల్ డిఎస్‌సికి ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్, రంపచోడవరం, చింతూరు (అల్లూరి జిల్లా)

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ఏరియాలోని పోస్టులను మినహాయించి ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యాన అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎను గిరిజన నిరుద్యోగులు బుధవారం ముట్టడించారు. రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ఎదుట ధర్నాలు చేశారు. పాడేరులో ముందుగా మోదకొండమ్మ గుడి ఆలయ ప్రాంగణం నుంచి మెయిన్ బజార్ మీదుగా ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ వద్ద పోలీసులు అడ్డుకోగా ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుంటూ ఐటిడిఎ గేటు వరకు చేరుకుని అక్కడ సుమారు గంటపాటు నినాదాలు చేశారు. అనంతరం మెయిన్ రోడ్డుకు అడ్డంగా బైఠాయించి ధర్నా నిర్వహించారు. గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. పాడేరు సిఐ దీనబందు కల్పించుకొని ఐటిడిఎ పిఒ లేకపోవడంతో ఎపిఒ వెంకటేశ్వరరావును కార్యాలయం నుంచి బయటకు పిలిపించి వినతిపత్రం అందజేయించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఆదివాసి అధికార్ మంచ్ జాతీయ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ.. ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో టిడబ్ల్యు టీచర్ పోస్టుల్లో 781 పోస్టులకుగాను



రంపచోడవరం ఐటిడిఎ ఎదుట రోడ్డుపై మండుటెండలో బైఠాయించిన ఆందోళనకారులు

ఎస్‌టిలకు కేవలం 42 మాత్రమే కేటాయించారని, ఆదివాసీలకు 6 శాతం, గిరిజనేతులకు 94 శాతం పోస్టులు కేటాయించడంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరిస్తామని గతేడాది జనవరి 20న అరకులో జరిగిన ఎన్నికల సభలో ప్రతిపక్షనేతగా చంద్రబాబు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర మాట్లాడుతూ.. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌తో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర ఆభద్రత భావం, ఆందోళన కలిగిస్తోందన్నారు. రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ఎదుట ధర్నాలు నిర్వహించి, బైఠాయించిన గిరిజన నిరుద్యోగులు ఐటిడిఎ పిఒ బయటకొచ్చి వినతిపత్రం స్వీకరించాలని డిమాండ్ చేశారు. పిఒ బయటకు రాకపోవడంతో వారు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఐటిడిఎ ఎదురుగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. అనంతరం పిఒ నిరుద్యోగులు నుంచి వినతిపత్రం తీసుకున్నారు. రంపచోడవరంలో జరిగిన ధర్నాలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం జిఒ 3ను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, నూరు శాతం ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంత గిరిజనులకే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

నెల్లూరు జిల్లా నారంపేటలో 11 ఎంఎస్ఎంఇ పార్కులు

- మేడే సందర్భంగా నేడు ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లా నారంపేటలో 11 ఎంఎస్ఎంఇ పార్కులు, ఒక ఎఫ్ఎఫ్‌సి పార్కును ఏర్పాటు చేయనున్నారు. మేడే సందర్భంగా గురువారం (నేడు) ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పార్కులను ప్రారంభించనున్నారు. అలాగే మరో 14 ఎఫ్ఎఫ్‌సిలు, 25 కొత్త ఎంఎస్ఎంఇ పార్కులకూ ఆయన శంకుస్థాపన చేయనున్నారు. 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తామని ఇంతకుముందే సిఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పాణ్యం, డోన్, ఆత్మకూరు, దర్శి, పుట్టపర్తిలో పార్కులు ప్రారంభం కానున్నాయి. అలాగే యలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లిలో ఎఫ్ఎఫ్‌సిని కూడా వర్చువల్‌గా సిఎం ప్రారంభించనున్నారు. మొత్తం 999 ఎకరాల్లో నెలకొల్పే ఈ 11 ప్రాజెక్టులకు రూ.199 కోట్లు ఖర్చు కానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 2028 నాటికి మొత్తం అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ పార్కులను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. 1455 ఎకరాల్లో కొత్తగా ఏర్పాటు చేసే పార్కులకు రూ.559 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రతి పార్కులోనూ కనీసం 100 నుండి 150 వరకూ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇ పార్కుల ద్వారా రెండు లక్షల ఉద్యోగాలు కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ట్రూఅప్ సర్దుబాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్, ట్రూడౌన్ మోపాలని విద్యుత్ పంపిణీ సంస్థలు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి విడివిడిగా ప్రతిపాదనలు సమర్పించాయి. అయితే ఈ ట్రూఅప్, ట్రూడౌన్‌లను గతేడాది టారీఫ్‌లోనే పంపిణీ సంస్థలు కొంత సర్దుబాటు చేశాయి. మిగిలిన వాటిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సర్దుబాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ సదరన్ విద్యుత్ పంపిణీ కంపెనీ లిమిటేడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) 4వ నియంత్రణ కాలానికి సంబంధించి రూ.3,346 కోట్ల ట్రూఅప్‌ను ప్రతిపాదించింది. ఇందులో రూ.1418 కోట్లు అప్పుల కోసం చెల్లించిన వడ్డీలు ఉండటం గమనార్హం. మొత్తం రూ.3,346 కోట్లలో ఇప్పటికే రూ.2 వేల కోట్లను 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌పిడిసిఎల్ సర్దుబాటు చేసింది.

మిగిలిన రూ.1346 కోట్లను సర్దుబాటు చేసేందుకు ఇఆర్‌సిని అనుమతి కోరింది. ఆంధ్రప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ కంపెనీ లిమిటేడ్ (ఎపిసిపిడిసిఎల్) 4వ నియంత్రణ కాలానికి రూ.1400 కోట్లు ట్రూఅప్ కింద ఇఆర్‌సికి ప్రతిపాదించాయి. ఈ ట్రూడౌన్‌ను వినియోగదారులకు చూపించకుండా, తెలియకుండానే 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.478.91 కోట్లు సర్దుబాటు చేసింది. మిగిలిన రూ.921.09 కోట్లను సర్దుబాటు కోసం ఇఆర్‌సిని అనుమతి కోరింది. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ కంపెనీ లిమిటేడ్ (ఎపిఇపిడిసిఎల్) 4వ నియంత్రణ కాలానికి రూ.2042.66 కోట్లుగా చూపించింది.

వీటిల్లో రూ.67.91 కోట్లను పంపిణీ సంస్థ వ్యాపారంలో గ్యాప్‌గా చూపించింది. మిగిలిన రూ.1974.75 కోట్లలో రూ.1800 కోట్లను 2024-25 ఆర్థిక సంవత్సరంలో సర్దుబాటు చేసింది. మిగిలిన రూ.174.75 కోట్లను సర్దుబాటు చేసేందుకు ఇఆర్‌సికి ప్రతిపాదించింది.

రోడ్డెక్కిన విఆర్‌ఎలు

- వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్
- కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు



పల్నాడు కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరావు తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

వేతనాలు పెంచాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు విఆర్‌ఎలతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎలు రొడ్డెక్కారు. ఎపి రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించి, అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నెలకు రూ.21000ల వేతనం ఇవ్వాలని, అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. గ్రామ సేవకులకు గౌరవ వేతనం పేరుతో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. నెలకు రూ.10,500 జీతంతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. గతంలో డిఎ ఇచ్చేవారని, ప్రస్తుతం ఇవ్వడం లేదని తెలిపారు. తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా, అనంతరం అధికారులో సామూహిక రాయబారం నిర్వహించారు. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న 20 వేల మంది విఆర్‌ఎలు చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారని, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో జీతాలు పెరుగుతాయని, ఉద్యోగోన్నతులు వస్తాయని ఆశించినా భంగపాటే ఎదురైందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నైట్‌వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలు వేశారని, రీసర్వే పేరుతో ఇతర ప్రాంతాల్లో విధులు వేస్తున్నారని, టిఎ, డిఎలు అమలు చేయడం లేదని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ఎఒ శివలీలకు వినతిపత్రం ఇచ్చారు. కడప, అనకాపల్లి, పార్వతీపురం కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు వెంకన్న మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సహాయకులు గ్రామాల్లో నివసిస్తూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నామని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. రీ సర్వే పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేయాల్సి వస్తుందని తెలిపారు. అదనపు పనిభారం పెంచినా టిఎ, డిఎల గురించి మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బి అతిథిగృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. పేస్కేల్ అమలు, తదితర సమస్యల పరిష్కారం కోసం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

ఐక్య ఉద్యమాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)




ఐక్య ఉద్యమాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1539వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో సిఎఫ్‌టియుఐ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు సురేష్‌బాబు, వెంకటరావు మాట్లాడుతూ.. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో కార్మికులు రోజురోజుకు తగ్గిపోతుండడంతో ఉన్న కార్మికులపై పనిభారం మరింత పెరుగుతోందన్నారు. ప్లాంట్‌లో యంత్రాలు మరమ్మతులకు గురికావడంతో కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు.

స్టీల్‌ప్లాంట్ బిఎఫ్-1లో గ్యాస్ లీకేజీ

- ఆరుగురికి అస్వస్థత

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నెస్-1లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హోస్ పైపు మార్చే సమయంలో గ్యాస్ లీక్ అయ్యింది. ఈ ప్రమాదంలో సీనియర్ మేనేజర్లు సుస్మిత్, యాదవ్, ఎ.వెంకటేశ్వరరావు, రామరాజు, కాంట్రాక్టు కార్మికులు అప్పలరాజు, దేవుడు అస్వస్థతకు గురయ్యారు. వారందరినీ అంబులెన్స్‌లో స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. వైద్యుల సూచనల మేరకు వెంకటేశ్వరరావును సెవెన్ హిల్స్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అధిక ఉత్పత్తిని తీసేందుకు కార్మికులపై పని భారాన్ని పెంచుతూ, భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఇంత పెద్ద పరిశ్రమలోని అంబులెన్స్‌లో కనీసం ఆక్సిజన్ లేకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



యువతకు నైపుణ్యాభివృద్ధి, సాధికారత

- యునిసెఫ్‌తో విద్యా, ఐటి శాఖల ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువతకు, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, సాధికారత కల్పించే దిశగా యునిసెఫ్‌తో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం కీలక ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఈ ఎంఒయు జరిగింది. ఎపిఎస్ఎస్‌డిసి, యునిసెఫ్ యువాహ్ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్ఐ), యూత్ హబ్, పాస్‌పోర్టు టు ఎర్నింగ్ (పి2ఇ) కార్యక్రమాలను ఈ ఒప్పందంలో భాగంగా అమల్జేయనున్నట్లు మంత్రి లోకేష్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎఫ్ఎస్ఐ ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యసించే 2 లక్షల మంది యువతకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగ కల్పన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అందించేందుకు యూనిసెఫ్ గ్లోబల్ యుపిషిఫ్ట్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా శిక్షణ ఇస్తారని తెలిపింది. బహుభాషా డిజిటల్ వేదిక ద్వారా యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వాలంటీర్‌షిప్ అవకాశాలను కల్పిస్తారని పేర్కొంది. పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్(పి2ఇ) కార్యక్రమం ద్వారా 15 నుంచి 29 ఏళ్ల యువతకు ఉచితంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్, ప్రొఫెషనల్ నైపుణ్య శిక్షణ అందిస్తారని వెల్లడించింది. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి, సిఇవో జి గణేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్, యునిసెఫ్ ఎపి, కర్ణాటక, తెలంగాణ ఫీల్డ్ ఆఫీస్ సిఎఫ్‌వో జిలాలిమ్ బిర్హాను టెఫెస్సె, ఫీల్డ్ ఆఫీస్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ యురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో కూల్చిన పేదల ఇళ్లను వెంటనే పున: నిర్మించాలి

- చర్చా వేదికలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశ్చిమ గోదావరి జిల్లాలోని అల్లూరి సీతారామరాజు కాలనీ (పాలకోడేరు, ఉండి)లో కూల్చివేసిన పేదల ఇళ్లను వెంటనే పున:నిర్మించాలని ఉభయ వ్యవసాయకార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చర్చా వేదికలో పలువురు వక్తలు డిమాండ్ చేశాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజుపై చర్యలు తీసుకోవాలని కోరారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం బికెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి హెచ్ కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అధక్షతన జరిగిన ఈ చర్చా వేదికలో ఎపి వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి శ్రీనివాసరావు, ఐలు రాష్ట్ర నాయకులు మాధవరావు మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఉండిలో పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే అదే స్థలంలో పక్కా గృహాలు నిర్మించి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు తన జీవితం అంకితం చేస్తామని రాజ్యాంగంపై ప్రమాణం చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు నిరుపేదల ఇళ్లు కూల్చివేతకు కారణమవ్వడం సిగ్గుచేటు అని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదలకు 150 గజాలు (3 సెంట్లు) వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని ప్రకటించిన సందర్భాన్ని గుర్తు చేశారు. వ్యవసాయకార్మిక సంఘంరాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు మాట్లాడుతూ హైకోర్టు స్టే విధించినా..పేదల ఇళ్లు కూల్చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పైగా పంటకాలువను మలినం చేశారనే తప్పుడు ఆరోపణలు చేసి, ఆ సాకుతో కూల్చివేయడం దుర్మార్గమన్నారు. పేదలకు అండగా అక్కడకు వెళ్లి అన్యాయాన్ని ప్రశ్నించిన సిపిఎం నాయకులపై డిప్యూటీ స్పీకర్ నోటికొచ్చినట్లు మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, జక్కం శెట్టి సత్యనారాయణ, కోట కళ్యాణ్, ఐద్వా రాష్ట్ర నాయకులు కె.శ్రీదేవి, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు నటరాజు, పి.నైనవరం మాజీ సర్పంచి మాతంగి ఆంజనేయులు, ఎం. సురేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము, మాజీ కార్యదర్శి సూర్యారావు, బికెఎంఎస్ నాయకులు బుడి కిషోర్, ఉండి ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు నాగరాజు, జోగి నరసింహమూర్తి, మజ్జిడ పార్వతి, వర్రి లక్ష్మి, వెలసూరి దుర్గ, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అప్పలస్వామి పాల్గొన్నారు.

తెలంగాణ టెన్త్‌లో 92.78 శాతం ఉత్తీర్ణత

- బాలికలదే పైచేయి
- 4,629 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత
- అగ్రస్థానంలో మహబూబాబాద్, అట్టడుగున వికారాబాద్
- ఫలితాలు విడుదలచేసిన సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విడుదల చేశారు. ఈ ఏడాది 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 91.31 శాతం ఉత్తీర్ణత వచ్చింది. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల్లో గతేడాది కంటే ఇప్పుడు 1.47 శాతం ఉత్తీర్ణత పెరిగింది. పదో తరగతి పరీక్షలకు 5,07,107 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు 4,96,374 మంది, ప్రయివేటు విద్యార్థులు 10,733 మంది ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 4,96,374 మంది పరీక్షలకు హాజరుకాగా, 4,60,519 (92.78 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు 2,50,345 మంది పరీక్షలు రాయగా, 2,28,608 (91.32 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. బాలికలు 2,46,029 మంది పరీక్షలకు హాజరైతే 2,31,911 (94.26 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు కంటే బాలికలు 2.94 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత పొందారు.

ఈ ఏడాది 10,733 మంది విద్యార్థులు ప్రయివేటుగా పరీక్షలకు హాజరుకాగా, 6,141 (57.22 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇందులో 7,336 మంది బాలురు హాజరైతే 4,045 (55.14 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 3,397 మంది బాలికలు పరీక్ష రాస్తే, 2,096 (61.70 శాతం) మంది పాసయ్యారు. ప్రయివేటు విద్యార్థుల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే బాలికలు 6.56 శాతం మంది అధికంగా ఉత్తీర్ణులయ్యారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు (సిడబ్ల్యుఎస్ఎన్) కేటగిరీ ఫలితాలను ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రకటించారు. 1,306 మంది విద్యార్థులు హాజరైతే 1,222 (93.57 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. వారిలో 774 మంది బాలురు పరీక్షలు రాయగా, 717 (92.64 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 532 మంది బాలికలు పరీక్షలు రాస్తే, 505 (94.92 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి సురేష్‌షెట్కార్, మాజీ ఎంపి వి హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, హర్కర వేణుగోపాల్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రత్యేక కార్యదర్శి హరిత, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

యానాం జిప్‌మెర్‌కు సాయమందిస్తాం : సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పుదుచ్చేరిలో భాగమైన యానాంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మెర్)లో సూపర్ స్పెషాల్టీ సేవలందించేందుకు తగిన సాయం అందజేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

ఈ మేరకు మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, జిప్‌మెర్ డైరెక్టర్ వీఎస్ నేగి విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. జిప్‌మెర్ సేవలు తెలుగు ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తాయని, తగు సాయాన్ని చేయాలని మల్లాడి కోరారు. ప్రసూతి సేవలు, పిల్లల వైద్యం, మత్తు వైద్యం, శస్త్ర చికిత్స వంటి వివిధ సూపర్‌స్పెషాల్టీ విభాగాల్లో నిపుణులైన వైద్యులను, నర్సులను డిప్యూటేషన్‌పై నియమించాలని డైరెక్టర్ నేగి కోరారు. జిప్‌మెర్ కోరిక మేరకు వివిధ అంశాలపై తగు సాయాన్ని అందిస్తామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు నిర్దిష్ట ప్రతిపాదనలను అందజేయాలని సూచించారు.

డిఎస్సి పోస్టుల్లో 3 శాతం క్రీడా కోటా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమనిరాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మెగా డిఎస్సిలో 3 శాతం క్రీడా కోటా నోటిఫికేషన్‌ను విజయవాడలోని శాప్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన క్రీడాకారులకు 3 శాతం హారిజంటల్ రిజర్వేషన్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మెగా డిఎస్సిలో 16,347 పోస్ట్‌ల్లో క్రీడా కోటాకు 421 పోస్టులను కేటాయించినట్లు చెప్పారు. ఈ కోటాకు ఎంపికను పారదర్శకంగా, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెగా డిఎస్సికి అర్హులైన క్రీడాకారులు అందరూ మే 2 నుంచి 31వ తేదీ వరకూ https://sports.ap.gov.in, https://sportsdsc.apcfss.in అనే వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ జడ్పీ, ఎంపిపి పాఠశాలల్లో 333 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 30 పోస్టులు, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ పాఠశాలల్లో 22 పోస్టులు, ఎపి రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2 పోస్టులు, ఎపి మోడల్ స్కూల్స్‌లో 4 పోస్టులు, ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 7 పోస్టులు, ఎపి గురుకుల వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 23 పోస్టులు క్రీడా కోటా కింద కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో క్రీడా ప్రాధికార సంస్థ ఎండి గిరీష, శాప్ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు యువకుడు బలి?

ప్రజాశక్తి అచ్చంపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి గ్రామానికి చెందిన షేక్ సలీం (19) అచ్చంపేటలో ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్నారు.



షేక్ సలీం(ఫైల్)

ఆయనకు ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగులు వేస్తున్నారు. ఇటీవల ఐపిఎల్ ప్రారంభమైనప్పటి నుండి బెటింగ్‌లు ఆడుతూ ఉన్న డబ్బులు పోగొట్టుకున్నారు. ఈ కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఏప్రిల్ 23న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సలీం బుధవారం మృతి చెందారు. అయితే, పోలీసులు మాత్రం స్నేహితుల మధ్య వివాదమే ఆత్మహత్యకు కారణంగా చెబుతున్నారు. సలీం తన స్నేహితుల వద్ద రూ.3 వేలు తీసుకున్నాడని, వాటిని తిరిగివ్వకపోవడంతో జరిగిన వివాదం ఆత్మహత్యకు దారితీసిందని సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత సహకార సంఘాల ఎన్నికలకు చర్యలు

- మంత్రి సవిత ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఇటీవల చేనేత శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆర్పీ సిసోడియా, సచివాలయంలో మంత్రి సవితను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆప్కోలో ప్రక్షాళన చేపట్టాలని, చేనేత వస్త్రాల విక్రయాలు పెరిగేలా చేనేత బజార్లు విస్తృతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ శాఖల ఆర్డర్లు మేరకు త్వరితగతిన ఆప్కో నుంచి వస్త్రాలు సరఫరా చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సాంఘిక, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు దుప్పట్లు, టవళ్లు, ఇతర అవసరాలకు క్లాత్‌ను అందించాలని సూచించారు. రాష్ట్రంలో హస్త కళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా లేపాక్షిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

పరిశోధనలు రైతులకు చేరువ కావాలి

- పెట్టుబడి వ్యయం తగ్గింపు అవసరం
- దిగుబడుల పెంపునకు ప్రణాళికలు చేయాలి
- ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు
- ముగిసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతులకు సాగు పెట్టుబడి తగ్గేలా, అధిక ఉత్పత్తులు వచ్చేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు పెంచాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. గుంటూరు జిల్లా లాంలో ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డైమండ్ జూబ్లీ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వర్సిటీ ప్రాంగణంలోని ఎన్‌జి రంగా విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన సిబ్బంది, పరిశోధకులు, మంచి సదుపాయాలతో ఘన చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయం సేవలు, వ్యవసాయ పరిశోధనలు రైతులకు మరింత చేరువ కావాలని తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి సూచనలు చేయాలన్నారు. ప్రతి ఏటా రైతులను ఇబ్బంది పెడుతున్న తెగుళ్లకు పరిష్కారం చూపాలని సూచించారు. పల్నాడులో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. నకరికల్లులో ఇండో-ఇజ్రాయల్ ప్రాజెక్టు నిర్మాణం చివరి దశలో ఉందని, త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చెప్పారు. సహకార సంఘాల ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చే ప్రణాళికలు రావాలన్నారు. పత్తి, మిర్చిపై ఏటా తెగుళ్ల వచ్చి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సూచించే దిశగా విశ్వవిద్యాలయం కృషి చేయాలన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఏ పంట సాగు చేసినా రైతులకు నష్టాలు తప్పడం లేదన్నారు. లాభదాయకమైన సాగుపై మెళకువలు రైతులకు చేరువకావాలని, ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు. మాజీ ఎంపి యలమంచిలి శివాజీ మాట్లాడుతూ ల్యాబ్ టు ల్యాండ్‌కు పరిశోధనలు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు సాంకేతిక సదస్సులు నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ప్రైవేటు ఇండస్ట్రీ ప్రముఖులతో చర్చ గోష్ఠి, నిపుణుల సందేశాలతో వజ్రోత్సవ వేడుకలు ముగిశాయి.

చీనీ రైతు కుదేలు!

- టన్ను రూ.15 వేలే
- గతేడాది కంటే ఈ ఏడాది మూడో వంతుకు దిగజారిన ధర
- షూట్ పేరుతోనూ దళారుల దోపిడీ



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

దళారులు కుమ్మక్కై చీనీ ధరను తగ్గించేస్తున్నారు. షూట్ పేరుతోనూ దోపిడీకి పాల్పడుతున్నారు. దీంతో, చీనీ రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గతేడాది మార్చి, ఏప్రిల్‌ల్లో చీనీ కాయలకు టన్ను ఒక్కంటికీ రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ ధర పలికింది. సగటు ధర రూ.55 వేలు లభించింది. ప్రస్తుతం టన్ను ధర రూ.15 వేల నుంచి రూ.22 వేల మధ్యే ఉంది. సగటు ధర రూ.19 వేలు వస్తోంది. గత ఏడాదితో పోలిస్తే మూడు రెట్లకుపైగా ధర తగ్గిపోయింది. వైఎస్‌ఆర్ కడప జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామని చెప్పిన పాలకులకు చీనీ రైతుల కష్టాలు పట్టడం లేదు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 2,36,577 ఎకరాల్లో చీనీ సాగవుతోంది. అత్యధిక విస్తీర్ణంలో అనంతపురం జిల్లాలో 92,966 ఎకరాల్లో, ఉమ్మడి కడప జిల్లాలో 62,792 ఎకరాల్లో, శ్రీసత్యసాయి జిల్లాలో 32,833 ఎకరాల్లో సాగులో ఉంది. కర్నూలు, నంద్యాల, నెల్లూరు తదితర జిల్లాల్లోనూ సాగు చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట, రైల్వేకోడూరు, బద్వేలు, పులివెందుల నియోజకవర్గాల పరిధిలో పెద్ద ఎత్తున సాగవుతోంది. ఎకరా విస్తీర్ణంలో సాగుకు సుమారు రూ.లక్ష పెట్టుబడి అవుతోంది. ఎకరా విస్తీర్ణంలో కనిష్ఠంగా ఐదు టన్నులు, గరిష్ఠంగా ఎనిమిది టన్నుల దిగుబడి వస్తోంది. రైతుల నుంచి పది టన్నులు కొనుగోలు చేస్తే 2.5 టన్నులను మినహాయించి 7.5 టన్నులకే దళారులు ధర చెల్లిస్తున్నారు. ఎకరానికి సగటున 6.5 టన్నుల దిగిబడి మాత్రమే వస్తోందని రైతులు చెప్తున్నారు. షూట్ పేరుతో దళారులు 25 శాతం మినహాయించి మిగిలిన 75 శాతం పంటకు (4.9 టన్నులకు) మాత్రమే ధర చెల్లిస్తున్నారు. అంటే రైతులకు ఎకరా ఒక్కంటికీ రూ.93,100 మాత్రమే సగటు ధర దక్కుతోంది. సుమారు ఏడు వేల రూపాయల వరకూ నష్టపోతున్నారు. చీనీని తినేందుకు, జ్యూస్‌కు, మందుల తయారీకి వినియోగిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో టన్ను చీనీ ధర రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ ఉంది. దీనిని బట్టి దళారులు ఎంతగా వెనకేసుకుంటున్నారో స్పష్టమవుతోంది. జిల్లా నుంచి ఢిల్లీ, కేరళ, తమిళనాడులోని కోయంబత్తూరు, కర్ణాటకలోని బెంగళూరు, తిరుచ్చి, మహారాష్ట్రలోని నాగపూర్ వంటి ప్రాంతాలకు చీనీ ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

ధర విషయంలో మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలపై చీనీ రైతులు ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. మార్కెట్ శక్తుల బారి నుంచి రక్షించి చీనీ పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు తోడ్పాటునందించాలి.

బి.దస్తగిరిరెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, వైఎస్‌ఆర్ కడప

మెటా ఎఐ యాప్ ఆవిష్కరణ

న్యూయార్క్ : ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృసంస్థ మెటా తన ఎఐ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. టెక్స్ట్ సంభాషణలు, వాయిస్ చాట్స్, ఇమేజ్ ఎడిటింగ్ వంటి ఫీచర్లను అందించే అధునాతన లామా 4 మోడల్‌తో నడిచే ఈ యాప్ ఆండ్రాయిడ్, యాపిల్ యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. ప్రత్యేక ఫీచర్లతో ఈ అప్లికేషన్‌ను తీసుకొచ్చినట్లు మెటా పేర్కొంది. ఈ ఎఐతో మాట్లాడటం మరింత సులభమని తెలిపింది. ఎటువంటి ప్రశ్నలకైనా సునాయాసంగా సమాధానం చెప్పగలదని పేర్కొంది.

ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్ బ్యాంక్ లాభాల్లో తగ్గుదల

బెంగళూరు : గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నికర లాభాలు 75 శాతం తగ్గి రూ.83 కోట్లకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా రుణాలు వ్యయాలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.330 కోట్ల నికర లాభాలు సాధించింది. గడిచిన క్యూ4లో మొత్తం ఆదాయం 4.4 శాతం పెరిగి రూ.1843 కోట్లుగా ఉండగా.. వ్యయాలు 19 శాతం ఎగిసి రూ.1483 కోట్లకు చేరాయి. ఉద్యోగుల వ్యయాలు పెరగడంతో పాటుగా డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లు చెల్లించాల్సి వచ్చిందని ఆ సంస్థ పేర్కొంది.



దేవినేని కుమారుడి వివాహానికి రేవంత్ హాజరు

ప్రజాశక్తి - కంకిపాడు (కృష్ణా జిల్లా)

టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కృష్ణా జిల్లా కంకిపాడులో బుధవారం జరిగిన ఈ వేడుకకు పలువురు ప్రముఖులు విచ్చేశారు. ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బిసి జనార్ధన్‌రెడ్డి స్వాగతం పలికారు.

బుడమేరుకు సమాంతరంగా మరొక ఛానల్

- జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బుడమేరు ఛానల్‌కు సమాంతరంగా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో మరొక కొత్త ఛానల్ అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. బుడమేరు ఆకస్మిక వరదల అనంతరం గండ్ల పూడ్చివేతకు సంబంధించిన అంశంపై బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న బుడమేరు డైవర్షన్ ఛానల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి యాక్షన్‌ప్లాను సిద్ధం చేయాలని సూచించారు. ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా విస్తరించాలని సూచించారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సాయంతో మున్సిపల్, రెవెన్యూశాఖలను కూడా కలుపుకొనిపోవాలని అన్నారు. భవిష్యత్‌లో విజయవాడకు ఎటువంటి నష్టమూ జరగకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఈఎన్‌సి వెంకటేశ్వరరావు, సిఇలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సేవ్ ఆర్‌డిటి జెఎసి నాయకులు

ఆర్‌డిటికి అండగా నిలవండి

- సేవ్ ఆర్‌డిటి జెఎసి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) సంస్థ ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యూవల్ చేయించేలా ప్రభుత్వంతో మాట్లాడి ఆర్‌డిటికి అండగా నిలవాలని సేవ్ ఆర్‌డిటి జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) నాయకులు కోరారు. ఈ మేరకు అనంతపురం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్‌కు జెఎసి నాయకులు షకీల్ షఫీ, వి రాంభూపాల్, వెంకటశివుడు యాదవ్, స్వరూప, మచ్చా రామలింగారెడ్డి కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కరువు జిల్లాను ఆదుకున్న సంస్థ ఆర్‌డిటి అని, ప్రభుత్వాలకు దీటుగా ప్రజలకు సేవలు అందిస్తోందని వివరించారు. నేటికీ లక్షలాది మందికి చేయూతనందిస్తోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, క్రీడలు, ఉపాధి ఇలా అన్ని రంగాలల్లోనూ ఆదుకుంటోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యూవల్ నిలుపుదల చేయడంతో ఆ సేవలనీ ఆగిపోయే ప్రమాదం నెలకొందన్నారు. స్పందించిన కలెక్టర్ రాష్ట్ర ఉన్నతాధికారుల ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సేవ్ ఆర్‌డిటి జెఎసి నేతలు రామిరెడ్డి, వలి తదితరులు పాల్గొన్నారు. ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనంతపురం టవర్‌క్లాక్ వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. విలేకరుల సంఘాల ఆధ్వర్యంలోనూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

పసిడి డిమాండ్‌కు ధరాఘాతం

- అమ్మకాల్లో 15 శాతం పతనం
- అభరణాల విక్రయాల్లో 25 శాతం క్షీణత
- వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వెల్లడి

న్యూఢిల్లీ : నింగికంటిన బంగారం ధరలు ఆ లోహం డిమాండ్‌ను దెబ్బతీస్తున్నాయి. 10 గ్రాముల బంగారం ధర ఇటీవల లక్ష రూపాయాలకు చేరి వినియోగదారులను బెంబేలెత్తిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రభావంతో కొనుగోళ్లు రెండంకెల స్థాయిలో పడిపోయాయి. ఈ ఏడాది జనవరి మార్చి త్రైమాసికంలో బంగారానికి సుమారు 15 శాతం డిమాండ్ తగ్గిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) బుధవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ మూడు నెలల కాలంలో బంగారం అమ్మకాలు 118.1 టన్నులకు పడిపోయాయి. పెట్టుబడుల డిమాండ్ మాత్రం 7 శాతం పెరిగి 46.7 టన్నులుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో అభరణాల డిమాండ్ ఏకంగా 25 శాతం క్షీణించి 71.4 మెట్రిక్ టన్నులకు క్షీణించింది. 2009 తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. ఈ ఏడాది బంగారం డిమాండ్ 700 నుంచి 800 టన్నుల వరకు ఉంటుందని డబ్ల్యుజిసి అంచనా వేస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బంగారం ధర 25 శాతం ఎగిసింది. గడిచిన రెండు వారాల్లో స్వల్పంగా దిగివచ్చినప్పటికీ ఇప్పటికీ హెచ్చు ధరనే పలుకుతోంది. ఒక దశలో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ. 1లక్ష దాటేసింది. ఇది కొనుగోళ్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. కాగా.. అక్షయ తృతీయ, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్ల సెంటిమెంట్‌కు మద్దతు ఇస్తుందని డబ్ల్యుజిసి ఇండియా సిఇఒ సచిన్ జైన్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం, అక్షయ తృతీయ రోజున న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.80 తగ్గి రూ.98,040గా పలికింది. 22 క్యారెట్లపై రూ.50 తగ్గి రూ.89,900గా నమోదయ్యింది. గతేడాది అక్షయ తతీయ రోజున 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.73,500గా ఉంది. ఏడాదిలోనే దాదాపు 27వేల మేర ధర పెరగడం వినియోగదారులు కొనుగోళ్లకు వెనుకాడుతున్నారు. ఈ ఏడాది అక్షయ తృతీయకి ఆశించిన డిమాండ్ లేదని పసిడి వర్తకులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు. రికార్డు ధరల కారణంగా వినియోగదారులు చిన్నపాటి, తేలికైన ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. కొందరేమో ధర తగ్గుతుందని వేచి చూస్తున్నారని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

గతేడాది నిస్సాన్ 99వేల యూనిట్ల విక్రయం

గూర్‌గావ్ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో 99,000యూనిట్ల పైగా విక్రయాలు చేసినట్లు నిస్సాన్ మోటార్ ఇండియా తెలిపింది. ఇందులో దేశీయంగా 28,000 పైగా యూనిట్లు, ఎగుమతుల్లో 71,000 యూనిట్లు సాధించినట్లు వెల్లడించింది. వన్ కార్, వన్ వరల్డ్" సిద్ధాంతం కింద ఎగుమతులు 65 కి పైగా దేశాలకు విస్తరించాయని పేర్కొంది. నిస్సాన్ వృద్ధికి భారత్ బలమైన స్తంభంగా ఉందని నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోర్రెస్ అన్నారు

మైక్రోసాఫ్ట్‌లో 30 శాతం కోడింగ్ ఎఐనే రాస్తోంది

- సిఇఒ సత్య నాదేళ్ల వెల్లడి



కాలిఫోర్నియా : కృత్రిమ మేధ (ఎఐ) ద్వారా తమ కంపెనీకి సంబంధించిన 30 శాతం కోడింగ్‌ను రాస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదేళ్ల వెల్లడించారు. కాలిఫోర్నియాలోని మెన్లో పార్క్‌లో నిర్వహించిన మెటా లామా ఎఐ డెవలపర్ కార్యక్రమంలో నాదేళ్ల మాట్లాడుతూ.. తమ సంస్థకు సంబంధించి 20 నుంచి 30 శాతం కోడ్‌ను ఎఐతోనే రూపొందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యత కోసం ఎఐ ఆధారిత టూల్స్‌పై ఆధారపడటం పెరుగుతోందన్నారు. క్రమంగా వీటి వినియోగం అధికమవుతోందన్నారు. ఇటీవలే గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. గూగుల్‌లో జనరేట్ చేసిన కోడ్‌ను ఇంజినీర్లు రివ్యూ చేస్తున్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందన్నారు.

సంపాదకీయం

భద్రత ఏదీ?

విశాఖ జిల్లా సింహాచలం అప్పన్న స్వామి సన్నిధిలో చోటుచేసుకున్న అపశ్రుతి దిగ్భ్రాంతికరం. చందనోత్సవం సందర్భంగా వరాహ నరసింహుని 'నిజరూప దర్శనం' చేసుకునేందుకు వచ్చిన భక్తులపై గోడకూలడంతో ఏడుగురు మరణించిన వార్త బుధవారం ఉదయాన్నే రాష్ట్ర ప్రజలకు బాధను కలిగించింది. తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో 300 రూపాయల ప్రత్యేక దర్శనం టికెట్ క్యూలైన్‌పై ఇటీవల నిర్మించిన సిమెంట్ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. అనూహ్యంగా జరిగిన ఈ సంఘటనతో అప్పటికే క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులకు గోడకింద చిక్కుకుని విలవిలలాడటం మినహా మరో మార్గం లేకుండా పోయింది. దాదాపు 20 అడుగుల పొడవున్న ఈ గోడను కొద్దిరోజుల కిందటే నిర్మించారని చెబుతున్నారు. దీంతో దీని నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సహాయ చర్యల్లో జాప్యం చోటుచేసుకుందని, క్యూలైన్ల వద్ద దేవాదాయ, రెవిన్యూశాఖల అధికారులు, సిబ్బంది కనిపించలేదన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. మృతుల కుటుంబాలకు 25 లక్షల రూపాయల నష్టపరిహారం ప్రకటించింది. బాధిత కుటుంబాల్లో ఒకరికి దేవాలయాల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని అధికారయంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. దుర్ఘటన జరిగిన తరువాత తీసుకునే ఈ తరహా చర్యల సంగతి ఎలా ఉన్నప్పటికీ, అసలు ప్రమాదం జరగకుండానే ఎందుకు చూడలేకపోయారన్న ప్రశ్నకు సమాధానం లేదు.

రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఈ తరహా సంఘటనలు కొత్తేమీ కాదు. ఈ ఏడాది జనవరి 8వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించిన విషయాన్ని, భవిష్యత్తులో అటువంటి దుర్ఘటనలు జరగకుండా చూస్తామంటూ ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రకటనలను రాష్ట్ర ప్రజలు ఇంకా మరచిపోలేదు. మహాకుంభమేళా సందర్భంగా జనవరి 28న ప్రయాగ్‌రాజ్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 30మంది మృత్యువాత పడటం, ఆ సందర్భంలోనే ఫిబ్రవరి 15న ఢిల్లీ రైల్వేస్టేషన్లో 18మంది మరణించడం ఈ ఏడాది చోటుచేసుకున్న దారుణాలు! ఇవే కాదు. 2022లో జమ్ము కాశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 12 మంది యాత్రికులు ప్రాణాలు విడిచారు. 2008లో రాజస్థాన్‌లోని చాముండి దేవి ఆలయంలో నవరాత్రి సందర్భంగా జరిగిన ఉత్సవాల్లో 224 మంది చనిపోయారు. అదే ఏడాది హిమాచల్ ప్రదేశ్‌లోని నైనా దేవి ఆలయంలో వర్షపు షెల్టర్ కూలడం తొక్కిసలాటకు దారితీసి 146 మంది ప్రాణాలను బలిగొంది. 2005లో మహారాష్ట్రలోని మంధర్ దేవి ఆలయంలో కొందరు భక్తులు తడిగా ఉన్నమెట్లపై జారి పడటంతో చోటుచేసుకున్న తొక్కిసలాట 291 మంది ప్రాణాలు పోవడానికి కారణమైంది. దాదాపుగా పుష్కరకాలం క్రితం గోదావరి పుష్కరాల సందర్భంగా మన రాష్ట్రంలో చోటుచేసుకున్న దుర్ఘటన ఇప్పటికీ గుర్తుకొస్తుంది!

ఇలా చెప్పుకుంటూ పోతే, ఈ జాబితాకు అంతుఉండదు. ఈ అన్ని దుర్ఘటనల్లోనూ భక్తులు భారీగా తరలిరావడం, కనీస ముందుజాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలం కావడమన్నది సాధారణాంశంగా కనపడుతుంది. కష్టాల కడలిలో చిక్కుకున్న భక్తులు ఊరడింపుకోసం ఆలయాలకు, ఉత్సవాలకు రావడం కొత్తేమీకాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉదారవాద ఆర్థిక విధానాలు కార్పొరేట్ల కొమ్ముకాస్తూ, సామాన్యులను బలిపశువులుగా మారుస్తుండటంతో దేవుళ్లను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో మరింతగా పెరుగుతోంది. దీనిని అవకాశంగా తీసుకుని రకరకాల పేర్లతో భక్తుల జేబులకు చిల్లుపెడుతున్న ప్రభుత్వాలు భద్రత విషయంలో మాత్రం దేవుడే దిక్కు అన్నట్లుగా వ్యవహరిస్తుండటం ఆందోళనకరం! ప్రభుత్వాల ఈ ధోరణి మారాలి. భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలి. దీనికి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలి. ఇప్పటికే వివిధ దేశాలు ఈ దిశలో అమలు చేస్తున్న విధానాలను పరిశీలించాలి. వర్షం వస్తే కూలిపోయే, గాలికి కొట్టుకుపోయే నిర్మాణాలకు కారణమైన పద్ధతులను మానుకోవాలి. భక్తులకు సౌకర్యాల కల్పన, వారి భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.

నివాళి



విప్లవం సాధించేందుకు పార్టీని మించిన ఆయుధం లేదు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం జరగకుండా ఎంత విస్తృతమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిర్మించినా విప్లవాన్ని జయప్రదం చేయలేం. ఈ విషయం మన ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు నరనరానా పట్టాలి. పార్టీని నిర్మించడం ద్వారా...బూర్జువా, పెట్టీ బూర్జువా అరాచక ట్రేడ్ యూనియన్ నాయకుల కన్నా భిన్నమైన వారమని...మన పార్టీ సభ్యులు రుజువు చేసుకోవాలి.

- పుచ్చలపల్లి సుందరయ్య

జననం :1.5.1913
మరణం : 19.5.1985

మేడే స్ఫూర్తితో 'లేబర్ కోడ్స్' రద్దుకై ఉద్యమిద్దాం

సందర్భం

చారిత్రాత్మక అంతర్జాతీయ కార్మిక పోరాట దినోత్సవం మేడేని యావత్ ప్రపంచం జరుపుకుంటున్నది. హే మార్కెట్ అమరుల త్యాగాలతో మే దినోత్సవం...8 గంటల పని హక్కును సాధించుకోవటంతో పాటు, పెట్టుబడిదారీ దోపిడికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో ప్రపంచ కార్మిక వర్గాన్ని ఏకతాటి పైకి తెచ్చింది. 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అనే సమర నినాదాన్ని ఆచరణలో నిజం చెయ్యటంలో మహత్తరమైన శక్తిని ప్రదర్శించింది. అయినా హే మార్కెట్ ఘటనకు దారితీసిన సమస్యలు న్యాయబద్ధమైన సంపద పంపిణి, వాక్, సభా స్వాతంత్ర్యాలు, నిరుద్యోగం, మైనారిటీల హక్కులపై దాడులు, రాజకీయ అవినీతి, పోలీసు కిరాతకత్వం, ఆఖరికి కార్మికులకు సంఘం పెట్టుకోవటానికి కూడా స్వేచ్ఛ లేకపోవడం వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, అతి తక్కువ వేతనాలతో పని చెయ్యడం, పని భద్రత లేకపోవడం లాంటి అనేక సమస్యలతో కార్మిక వర్గం నేటికీ ఇబ్బందులు పడుతున్నది. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులకు రక్షణ లేకుండా చేసి దోపిడీని తీవ్రతరం చెయ్యటానికి...బ్రిటిష్ వారి కాలంలో పోరాడి సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తెస్తున్నది. బలమైన కార్మిక ప్రతిఘటన వలన ఐదు సంవత్సరాలుగా అమలు కాకుండా ఆపగలిగాం. కేంద్ర ఆర్థిక మంత్రి ఈ కోడ్లను ఈ సంవత్సరంలో ఎప్పుడైనా అమలు చేసేందుకు నోటిఫైడ్ చేస్తామని ప్రకటించారు. అందువలనే అన్ని కార్మిక సంఘాలు కలిసి మే 20వ తారీకున దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేయాలని కార్మిక వర్గం నిర్ణయించింది.



కె. సుబ్బరావమ్మ

మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ పేరుతో కార్మిక చట్టాలకు పాతరేయాలని చూస్తోంది. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే రాబోయే కాలంలో సంఘం పెట్టుకునే హక్కుతో సహ అనేక హక్కులు కోల్పోతాము. ఇప్పటికే బహుళజాతి సంస్థలు, స్పెషల్ ఎకనామిక్ జోన్‌లలో సంఘాలు పెట్టకుండా యజమానులు అనైతిక చర్యలకు పాల్పడుతున్నారు. సంఘాలు పెట్టినవారిని విధుల నుండి తొలగిస్తున్నారు. వారికి మద్దతు ఇచ్చిన వారిని యాజమాన్యం బెదిరిస్తున్నది. సమ్మెకు దిగితే ఫైన్లు, జైలు శిక్షలు పడే పద్ధతులను ఈ కోడ్లలో ఇమిడ్చారు. అయితే ఇటీవల తమిళనాడులో శ్యాంసంగ్ కార్మికులు యూనియన్ పెట్టుకోవడానికి చేసిన పోరాటం కార్మిక వర్గానికి స్ఫూర్తినిచ్చింది.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు కొనసాగుతున్నాయి. రైతాంగ పోరాటాలు, స్కీమ్ వర్కర్ల పోరాటాలు, మన రాష్ట్రంలో అంగన్వాడీల 42 రోజుల సమ్మె పోరాటం, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్సి కార్మికుల సమ్మె పోరాటాలు, గ్రామ పంచాయతీ కార్మికులు, ఉపాధి కార్మికుల పోరాటం వంటివి...రాబోయే కాలంలో కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగాను, ఎనిమిది గంటల పని హక్కు కోసం...పెద్ద ఎత్తున కార్మిక వర్గ పోరాటాలకు సిద్ధం కావాలనే స్ఫూర్తినిస్తున్నాయి. దోపిడీ రహిత సమాజం కోసం మేడే స్ఫూర్తితో కార్మిక లోకం పోరాడాలని పిలుపునిస్తున్నాయి.



పెట్టుబడిదారీ విధానంలో అసమానతలు తీవ్రమై పేదరికం, నిరుద్యోగం, ఆకలి, పోషకాహార లోపాలు పెరుగుతున్నాయి. సంక్షోభం కారణంగా వివిధ దేశాలపై సైనిక తిరుగుబాట్లు పెరుగుతున్నాయి. అమెరికా, గ్రీస్, అర్జెంటీనా, బ్రెజిల్‌లో సామ్రాజ్యవాద చర్యలకు వ్యతిరేకంగా కార్మికులు తమ హక్కులను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున సమ్మెలు, పోరాటాలు నిర్వహిస్తున్నారు.

ఒకవైపు అంతర్జాతీయ కార్మిక సంస్థ రోజుకు 7 గంటల చొప్పున వారంలో 5 రోజులు (అంటే వారానికి 35 గంటలు) మాత్రమే పని చేయాలని తీర్మానించింది. కానీ పెట్టుబడిదారులు లాభాపేక్షతో ఎక్కడా అమలు చేయడం లేదు. పెట్టుబడిదారులు తమ దోపిడిని మరింత తీవ్రతరం చేయాలనే దురాశతో వారానికి 90 గంటలు పని చెయ్యాలనడం చూశాం.

ఈ లేబర్ కోడ్‌లలో జాతీయ కనీస వేతనం రోజుకు అతి తక్కువగా రూ.178 నిర్ణయించారు. 1957 ఐ.ఎల్.సి సిఫార్సుల ప్రకారం ప్రస్తుతం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. అయితే ప్రస్తుతం తెచ్చిన కార్మిక కోడ్లలో యజమానులకి అనుకూలంగా మార్పు చేశారు. దీంతో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా యజమానులు వేతనాలు పెంచకుండా కార్మికులను దోపిడి చేస్తారు. పి.ఎఫ్‌లో యజమానుల వాటా శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టం వచ్చినట్లు తగ్గించేలా మార్పులు చేశారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశంలోని శ్రామిక మహిళలను మరొకసారి మోసం చేసింది. స్కీం వర్కర్లకు, ఆహార భద్రతకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించింది. 2025-26 సంబంధించి ఐ.సి.డి.ఎస్ కు కేవలం రూ.21,960 కోట్లు కేటాయించారు. రూ.150 కోట్లు పెరుగుదల ఉన్నట్లు కనబడినా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే బడ్జెట్ కేటాయింపులో వాస్తవ తగ్గుదల ఉంది. కోటి మంది స్కీం వర్కర్లు కార్మికులే అని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చినా వారికి నేటికీ ఇ.ఎస్.ఐ, పి.ఎఫ్ వంటి సామాజిక భద్రతా చట్టాలు వర్తించకుండా లేబర్ కోడ్ లలో పొందుపరిచారు. పైగా కార్పొరేట్లకి రాయితీలు ప్రకటిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన దేశంలో అసమానతలు విపరీతంగా పెరిగాయి. 5 శాతం ధనవంతుల వద్ద 70 శాతం సంపద పోగుపడింది. 50 శాతం ప్రజలు కేవలం 3 శాతం సంపదే కలిగి ఉన్నారు. దేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరుగుతుంది. వేతనాలు తగ్గిపోతున్నాయి. వేతన సగటు 2020లో 18.7 శాతం ఉంటే 2023లో 15.9 శాతానికి తగ్గింది. అదే సమయంలో లాభాల వాటా 38.7 శాతం నుండి 51.9 శాతానికి పెరిగింది. గత 10 సంవత్సరాల కాలంలో పేదరికం 17 శాతం పెరిగింది.

మన రాష్ట్రంలో 74 షెడ్యూల్ పరిశ్రమల్లో దాదాపు 50 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు వేతన సవరణ జరగాలి. కానీ ప్రభుత్వాలు మారుతున్నా (వైసిపి, టిడిపి) కార్మికులకు మాత్రం గత 20 సంవత్సరాల నుంచి వేతన సవరణ జరగలేదు. వీరికి కనీస వేతనం అమలు కావడం లేదు. పది మంది పైన పని చేసే పరిశ్రమల్లో పిఎఫ్, ఇఎస్ఐ, ప్రసూతి సెలవులు అమలు చేయాలి. 50 మందికి పైగా పని చేసే పరిశ్రమలో పిల్లలకు ప్రత్యేక సౌకర్యం, విశ్రాంతి గదులు, లంచ్ రూమ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలానే కార్మిక చట్టాల ప్రకారం వారానికి 48 గంటలు పని చేయాలి. కానీ ఏవీ అమలు కావవడంలేదు. తనిఖీలూ జరగడం లేదు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో మహిళా కార్మికులు 10 నుండి 12 గంటలు పని చేస్తున్నారు. రూ.8000 వేతనం ఇస్తున్నారు. ఎక్కువ టార్గెట్లు పెట్టి వేధిస్తున్నారు. పుండు మీద కారం చల్లినట్లు ఈ జనవరి 30న మరో అరగంట అదనంగా పని చేయాలని యాజమాన్యం ప్రకటించింది. వెంటనే కార్మికులు మెరుపు సమ్మెకు దిగి సిఐటియు చొరవతో సమస్యను పరిష్కరించుకున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు కొనసాగుతున్నాయి. రైతాంగ పోరాటాలు, స్కీమ్ వర్కర్ల పోరాటాలు, మన రాష్ట్రంలో అంగన్వాడీల 42 రోజుల సమ్మె పోరాటం, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్సి కార్మికుల సమ్మె పోరాటాలు, గ్రామ పంచాయతీ కార్మికులు, ఉపాధి కార్మికుల పోరాటం వంటివి...రాబోయే కాలంలో కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగాను, ఎనిమిది గంటల పని హక్కు కోసం...పెద్ద ఎత్తున కార్మిక వర్గ పోరాటాలకు సిద్ధం కావాలనే స్ఫూర్తినిస్తున్నాయి. దోపిడీ రహిత సమాజం కోసం మేడే స్ఫూర్తితో కార్మిక లోకం పోరాడాలని పిలుపునిస్తున్నాయి.

/ వ్యాసకర్త ఎ.పి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, సెల్ : 9490300341 /

కవిత్వం

దు:ఖపు చినుకు

నల్లని మేఘాల అంచుల్లో పొంచి ఉన్న మెరుపు ఖడ్గం
అనివార్యంగా గుండెల్ని తాకుతోంది
సముద్రగర్భంలో శీర్షాసనం వేసిన నల్లనయ్య
అలల తాకిడికి అల్లకల్లోలమవుతూ
తలపైకి పెట్టి తొంగిచూడటానికి వ్యాకులపడుతున్నాడు.

పొగలవుతూ చుట్టుముడుతోన్న
ధనుర్మాసపు మంచు
పొగతోటల్లోని చేదు మడ్డితో కలిసి
వింత వాసనలతో దేహాన్ని అల్లుకొంటోంది.

రాత్రి ఆకాశపు నక్షత్రాలు
కురుస్తున్న కన్నీటి వెలుగు
మరింత చీకటిని విస్తరింపజేస్తోంది
కన్నీటి చెమ్మ ఒక్కో గొంతు తడుపుతూ
రహస్య దేహాల దాహం తీరుస్తోంది
ఆకుపచ్చని మట్టి ఉమ్మనీటిలో నాని
జిల్లేడు మొక్కలై ఆకాశం వైపు తొంగిచూసి
మళ్లీ లోలోపలికి ముడుచుకొంటోంది.

ముక్కలవుతున్న మాటలు
నలుగురి ముందు తూలిపోతుంటాయి
నీకూ నాకూ మధ్య ఉండాల్సిందేదో
పలచబడి జావకారిపోతుంటుంది.

వాగ్దానాల ప్రపంచం
నిరంతరం చుక్కల్ని కోసి
మూసిన గుప్పెళ్లతో పంచిపెడుతూనే ఉంటుంది
తెరిచిన గుప్పెళ్లలోని శూన్యం
తరచూ నిన్ను వెక్కిరిస్తూ ఉంటుంది.

అర్థం లేని మాటల్ని కలిపి కుట్టిన అతుకుల బొంత
ఋతువు ఋతువుకు ఊలిపోయి
ముడుచుకున్న వాక్యమై మూలన పడివుంది
ఏ కాంతి కిరణమూ నీలలోహితమై చికిత్స చేయదు
మబ్బుల్లో మాయమైన దు:ఖపు చినుకు
వరదలవ్వాల్సిన కాలం వైపు ఒకో అడుగు
మెల్లగా... మెలమెల్లగా ....

- బండ్ల మాధవరావు

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

మధ్యతరగతి ఎందుకు కొనలేకపోతున్నది?

విశ్లేషణ

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మధ్యతరగతి నేడు కొనుగోలు తగ్గించుకుంటున్నది. గత అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ వర్గం నేడు ఆ ప్రభుత్వాల విధానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. పెరుగుతున్న ఖర్చులు-తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన చెందుతున్నది. తమ గురించి, తమ పిల్లల భవిష్యత్ గురించి వేదనకు గురౌతున్నది. తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నది. వీటన్నిటి ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారం, సరుకులు, వాహనాల కొనుగోలు రూపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరగతితో శక్తికి మించి అప్పులు చేయించి లాభపడిన వ్యాపార సంస్థలు నేడు వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని గగ్గోలు పెడుతున్నాయి. ఈ స్థితి నుండి తమను పాలకులు బయట వేస్తారనే విశ్వాసం కోల్పోయి, అతీతశక్తులను ఆరాధించడం పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచీకరణ విధానాలతో వేగంగా విస్తరించిన మధ్యతరగతి నేడు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల వల్ల తీవ్ర ఆందోళనకు గురౌతున్నది.

ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం, రాబోయే పది సంవత్సరాల్లో మన దేశంలో మధ్యతరగతి కుటుంబాలు రెట్టింపు అవుతాయి. 2024లో 35 కోట్లుగా వున్న ఈ తరగతి 2034 నాటికి 69 కోట్లకు పెరుగుతుందని తెలిపింది. అందుకే దేశాభివృద్ధిలో ఈ తరగతి వినిమయం చాలా కీలకమవుతుంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు వీరిని ఆకర్షించి వ్యాపారాన్ని పెంచుకోవడానికి, ఊహల పల్లకిలో పెట్టి పాలకులు లాభపడడానికి, అసత్యాలు, అర్థసత్యాలతో సంచలనాత్మక ప్రసారాలతో రేటింగ్ పెంచుకోవడానికి మీడియా నిత్యం అనేక ప్రయత్నాలు చేస్తుంటుంది. తమ అభివృద్ధికి అమెరికా డాలర్లను కొలమానంగా భావించే కొద్దిమంది మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు ట్రంప్ విధానాలతో భయాందోళన చెందుతున్నారు. దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతుంది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంది. తయారీ రంగం విస్తరించకపోవడం, కొత్త ఉపాధి అవకాశాలు తగ్గడం, మధ్యతరహా వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలు కష్టాల్లో కూరుకుపోయాయి.



వి. రాంభూపాల్

దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతున్నది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు.



హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా సంస్థలు పట్టణాల్లో కొనుగోలు తమ అంచనాల కంటే ఎక్కువగా తగ్గిందని ప్రకటించాయి. దేశంలో అతి పెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ పట్టణాల్లో తమ అమ్మకాలు 2 శాతం తగ్గాయని ప్రకటించింది. ఈ సంవత్సరం జనవరి నుండి, ద్విచక్ర వాహనాల అమ్మకాలు 9 శాతం తగ్గాయి. మోటార్ సైకిల్ అమ్మకాలు 13 శాతం, మోపెడ్ అమ్మకాలు 18 శాతం తగ్గాయి. నెస్లే ఇండియా ప్రతినిధి సురేష్ నారాయణన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అమ్మకాలు మందగించడం వెనుక 'తగ్గుతున్న మధ్యతరగతి' ఒక ముఖ్య కారణంగా చెప్పారు. 'ఒకప్పుడు రెండంకెలుగా ఉన్న ఆహార, పానీయాల రంగంలో వృద్ధి ఇప్పుడు 1.5 నుండి 2 శాతానికి పడిపోయింది' అని ఆయన పేర్కొన్నారు. నెలకు రూ.40,000 నుండి రూ.55,000 వరకు సంపాదించే వారు ఒక్కొక్కరు 5-6 రకాల రుణాలు రూ.6 లక్షల నుండి రూ.30 లక్షల వరకు తీసుకుంటున్నట్లు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నివేదిక తెలిపింది. వీరు పొందుతున్న ఆదాయంలో సుమారు 50 శాతం పైగా వడ్డీల చెల్లింపులకే సరిపోతుందట! దిగువ మధ్యతరగతి తమ దగ్గర వున్న బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం పెరిగింది. ఈ తరహా రుణాలు 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే 71 శాతం పెరిగాయి. అంతకు ముందు సంవత్సరంలో 17 శాతం పెరిగాయి. మార్చి 2020లో అప్పుల్లో వున్న కుటుంబాలు దేశ జాతీయోత్పత్తిలో 35 శాతం వుండగా, జూన్ 2024 నాటికి 43 శాతానికి పెరిగాయని రిజర్వుబ్యాంకు తెలిపింది. ఒకవైపు మధ్యతరగతి వాస్తవ పరిస్థితి దిగజారుతుంటే దేశ తలసరి ఆదాయం 2,841 డాలర్లు (సుమారు రూ. 2,52,000) కు చేరుకుందని, 2047 నాటికి రూ.15 లక్షలకు చేరుకుంటుందని ప్రధాని ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ ప్రకటిస్తున్నారు.

స్వాతంత్ర్యానంతరం అనుసరించిన విధానాల ఫలితంగా దేశంలో 1900 సంస్థలను ప్రభుత్వ రంగం నిర్వహించింది. ఇందులో లక్షల మంది ఉద్యోగాలు పొందారు. రైల్వే, రోడ్లు, ఓడరేవులు, ఇనుము, ఉక్కు, అల్యూమినియం, రెవిన్యూ, రక్షణ, శాంతిభద్రతలు, విద్య, వైద్యం, పోస్టల్, టెలికం లాంటి అనేక ప్రజా సర్వీసులు ఇలా అనేక రంగాలను ప్రభుత్వం నిర్వహించింది. వీటితో పాటు ప్రాజెక్టులు, మందులు, ఎరువుల పరిశ్రమలను ప్రభుత్వమే స్థాపించింది. బ్యాంకు, ఇన్సూరెన్స్‌లను జాతీయం చేసుకుంది. వీటన్నిటివల్ల స్థిరమైన వేతనాలు, చౌకగా విద్య, వైద్యం, రవాణా, గృహ వసతి లాంటి సదుపాయాలు పొందిన మధ్యతరగతి విస్తరించింది. వారి కొనుగోలుశక్తి పెరిగింది. ఇందుకు అవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడం కాకుండా దిగుమతి చేసుకోవడంతో 1990 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. దీనికి పరిష్కారం సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలను ఆచరించడమేనని గత ముప్పై సంవత్సరాలుగా పాలకులు చెబుతూ వచ్చారు. నేడు మధ్యతరగతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ మూడు విధానాలే కారణం.

1991 తర్వాత అనుసరించిన ఆర్థిక విధానాల వల్ల ఈ తరగతి వేగంగా విస్తరించింది. ఈ తరగతి అభివృద్ధిలో అప్పటి వరకు కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరిస్తూ, ప్రైవేటు రంగంలోని సర్వీసు రంగాల లాంటి వాటి ద్వారా అభివృద్ధి సాధించాలనుకోవడం ఇందులోని తీవ్ర వైరుధ్యం. కొత్త రంగాల్లో వేతనాల్లో పెరుగుదల వున్నప్పటికీ అంతకు ముందు పొందిన అనేక రకాల సేవలు, భద్రత సదుపాయాలు కోల్పోయారు. జాతీయ, అంతర్జాతీయ వ్యాపార సంస్థలు ఈ నయా మధ్యతరగతిలో విపరీతమైన వస్తు వ్యామోహాన్ని పెంచాయి. భద్రతతో కూడిన స్థిరమైన ఆదాయం లేకుండానే కృత్రిమ వినిమయంతో, అలవాట్లను మార్చగలిగాయి. తమను తాము ఉన్నత తరగతివారు ఏడు రూపాల్లో ప్రదర్శించుకుంటున్నారని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అవి, అవసరాలతో సంబంధం లేకుండా కొత్త వస్తువులను యథేచ్ఛగా కొనడం, ఆధునిక గృహ నిర్మాణాలు, అందులో అతి ఖరీదైన వస్తువులు ఏర్పాటు చేయడం పెరిగింది (హౌసింగ్ రుణాలు 2023లో 37.9 శాతం నుండి 2024లో 41, 2025 మొదటి అర్ధ భాగంలో 43.5 శాతానికి పెరిగాయి.). దేశీయ, విదేశీ విహారయాత్రలు, ఖరీదైన బ్రాండ్ వస్తువులు, దుస్తులు, కార్లు కొనడం, రెగ్యులర్‌గా హోటళ్లకు, రెస్టారెంట్లకు వెళ్లడం హోదాగా భావించడం, ఆధునిక వంటలు, ఖరీదైన విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చడం, మర్యాదల పేరుతో పెళ్ళిళ్ళు, రకరకాల ఫంక్షన్‌లకు భారీగా ఖర్చులు చేసే సంస్కృతి పెరిగింది. వీరి వల్ల నగరాలు, పట్టణాల్లో రియల్ ఎస్టేట్ రంగంతో పాటు, కార్పొరేట్ విద్యాలయాలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, వాహనాల షోరూంలు ఈ కాలంలో బాగా విస్తరించాయి. వీటన్నింటికి అవసరమైన డబ్బును వేతనాల ద్వారా పొందలేరు కాబట్టి సులభంగా రుణాలు ఇచ్చే పద్ధతులను ఫైనాన్స్ సంస్థలు అనుసరించాయి. వ్యక్తిగత జీవిత అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయి. వ్యసనాలు కూడా హోదాగా మారాయి. కుటుంబ విలువలుగా ఇన్నేళ్లు కీర్తించబడినవన్నీ ఛిద్రం అవుతున్నాయి.

అమెరికాలో 2008లో ప్రారంభమై ప్రపంచమంతా విస్తరించిన ఆర్థిక సంక్షోభం, ఆ తర్వాత కరోనాతో ఈ కృత్రిమ వినిమయానికి బ్రేకులు పడ్డాయి. గతంలో పొందిన వేతనాలు తగ్గాయి. గత సంవత్సరంతో పోలిస్తే 23 శాతం మందికి వేతనాలు తగ్గినట్లు వినిమయ సర్వే సంస్థలు ప్రకటించాయి. మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ నివేదిక ప్రకారం, ఆర్థిక మందగమనం మూడు రూపాల్లో స్పష్టంగా వ్యక్తమవుతుందని తెలిపింది. ఒకటి సాంకేతిక అభివృద్ధి (ఎ.ఐ), రెండు తీవ్రమవుతున్న ఆర్థిక మాంద్యం, మూడు క్షీణిస్తున్న ఆదాయం. ఇప్పుడు ఆటోమేషన్, టెక్నాలజీ ద్వారా అనేక ఉద్యోగాలు భర్తీ చేయబడుతున్నాయి. కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లో క్లరికల్ పోస్టులు గణనీయంగా తగ్గాయి. ఔట్‌సోర్సింగ్, ఆటోమేషన్ వంటి వాటికి ఖర్చు తగ్గించాలని యాజమాన్యాలు తీసుకున్న చర్యల వల్ల అనేక మందికి ఉపాధి తగ్గిపోయిందని జాతీయ గణాంక కమిషన్ మాజీ చైర్మన్ పి.సి మోహన్ పేర్కొన్నారు. దేశ వినిమయంలో కీలకమైన ఐటి రంగంలోని ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్ళకు గురౌతున్నారు. వేతనాల పెరుగుదల సరిగా లేకపోవడం, ఉద్యోగాల తొలగింపు, గతంలో వున్న కొద్దిపాటి ఆరోగ్య, రుణ సదుపాయాల వంటివి రద్దు కావడం, పని గంటలు పెంచాలనే యాజమాన్య డిమాండ్‌లతో వీరు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ దగ్గరవున్న కొద్దిపాటి డబ్బును గతంలాగా ఖర్చు చేయడానికి సిద్ధపడడం లేదు. బ్లూవెంచర్స్ సంస్థ దేశంలోని 30 కోట్ల మంది మధ్యతరగతి వారు తమ డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నారని తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా వున్న మధ్యతరగతి ఇంత ఒత్తిళ్ళను ఎదుర్కొంటుంటే దేశ పాలకుల్లో కనీస చలనం వున్నట్లు కనిపించడంలేదు. దేశానికి వినాశకరమైన రెండు విధానాలను అనుసరిస్తున్నారు. ఒకటి, కార్మిక చట్టాలను కాలరాచి, సహజ వనరులను, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం, రెండు, వీటిని ప్రశ్నించకుండా ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టడం. వీటిని ప్రశ్నించకుండా దేశాభివృద్ధి గురించి మాట్లాడలేం.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

గుండెపోటుతో షూటింగ్ కోచ్ సన్నీ థామస్ కన్నుమూత



కొట్టాయం: ప్రఖ్యాత షూటింగ్ కోచ్, మాజీ జాతీయ చాంపియన్ సన్నీ థామస్(83) కన్నుమూశారు. కొట్టాయంలోని ఉఝవూర్‌లో ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత అతనికి గుండెపోటు వచ్చిందని, ఆ సమయంలో ఆయన భార్య జోసమ్మ అక్కడే ఉన్నారని, ఆయన కుమారుడు మనోజ్ సన్నీ తెలిపారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు ధృవీకరించారు. జాతీయ షూటింగ్ చాంపియన్ అయిన థామస్.. 1993 నుంచి 2012 వరకు భారత షూటింగ్ బృందానికి కోచ్‌గా సేవలందించారు. ఆయన కోచ్‌గా ఉన్న సమయంలో భారత్.. ఒలింపిక్స్, వరల్డ్, ఏషియన్, కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించింది. ఇందులో 108 బంగారు, 74 సిల్వర్, 53 కాంస్య పతకాలు ఉన్నాయి. రైఫిల్ 3 పొజిషన్ ఓపెన్ సైట్ ఈవెంట్‌లో నేషనల్ చాంపియన్ అయిన థామస్.. కొట్టాయం రైఫిల్ క్లబ్‌లో తొలుత షూటింగ్‌ను ప్రారంభించారు. సన్నీ థామస్ జాతీయ కోచ్‌గా ఉన్నప్పుడే 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్(రజతం), 2008లో అభినవ్ బింద్రా(స్వర్ణం) దక్కాయి. ఆ తర్వాత 2021 లండన్ ఒలింపిక్స్‌లో విజయ్ కుమార్(రజతం), గగన్ నారంగ్(కాంస్యం)లు పతకాలు సాధించారు.

రెండోటెస్ట్‌లో బంగ్లా గెలుపు

- సిరీస్ 1-1తో సమం



చిట్టగ్రామ్: బంగ్లాదేశ్-జింబాబ్వే జట్ల మధ్య జరిగిన రెండు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం అయ్యింది. తొలి టెస్ట్‌లో జింబాబ్వే జట్టు 3వికెట్ల తేడాతో ఆతిథ్య బంగ్లాదేశ్‌పై సంచలన విజయం నమోదు చేసుకోగా.. రెండోటెస్ట్‌లో బంగ్లా జట్టు ఇన్నింగ్స్ 106పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తుచేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా జట్టు 444 పరుగుల భారీస్కోరును నమోదు చేయగా.. జింబాబ్వే జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 227పరుగులకే రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 111 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ మెహిదీ హసన్(5/32), తైజుల్ ఇస్లామ్(3/42) అద్భుత బౌలింగ్‌తో జింబాబ్వేను కట్టడి చేశారు. జింబాబ్వే జట్టులో బెన్ కర్రన్(46), కెప్టెన్ ఎర్విన్(25), మసకడ్జా(10) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ మెహిదీ హసన్ మిరాజ్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)...

బంగ్లాదేశ్ : 444ఆలౌట్- జింబాబ్వే : 227, 111పరుగులు.

33 ఏళ్ల సర్వీస్ ... 57 బదిలీలు

- ఐఏఎస్ అధికారి అశోక్ ఖేమ్కా పదవీ విరమణ
- అవినీతిని సహించని ఉన్నతాధికారిగా హర్యానాలో మంచి పేరు
- బిజెపి, కాంగ్రెస్ పాలనలో ఆయనపై తరచూ బదిలీ వేటు



అశోక్ ఖేమ్కా

చండీగఢ్ : అవినీతికి వ్యతిరేకంగా నిక్కచ్చిగా వ్యవహరించే అధికారిగా పేరున్న ఐఏఎస్ ఆఫీసర్ అశోక్ ఖేమ్కా పదవీ విరమణ చేశారు. ఈయన హర్యానా క్యాడర్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. అవినీతి, అక్రమాలను వ్యతిరేకించడం వ్యవహరించే ఈయన కెరీర్ మొత్తం బదిలీలతోనే నిండిపోయింది. తన 33 ఏండ్ల సర్వీసులో 57 సార్లు వేర్వేరు పోస్టులకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. దీంతో ఈ మూడు దశాబ్దాల సర్వీసులో భారతదేశంలో అత్యధికంగా బదిలీలు గావించబడిన సివిల్ సర్వెంట్‌లో ఒకరిగా అశోక్ ఖేమ్కా నిలిచారు. ఈయన సర్వీసులో సగటున ప్రతి ఏడు నెలలకు ఒకసారి బదిలీ అయ్యారన్నమాట. అశోక్ ఖేమ్కా అవినీతిని సహించని కారణంగా.. ఆయన తాను పని చేసిన విభాగాలలో అవకతవకలను బహిర్గతం చేసి, చర్యలు తీసుకునేవారు. దాని ఫలితంగా రాజకీయ, అధికార సంస్థల నుంచి వచ్చే ఒత్తిళ్ల కారణంగా ఆయన తరచూ పలు పోస్టింగ్‌లకు బదిలీ అయ్యేవారు.

కాంగ్రెస్ పాలనలో 21 సార్లు బదిలీ

2004 నుంచి 2014 మధ్య హర్యానాలోని భూపిందర్‌సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన 21 సార్లు బదిలీ అయ్యారు. ఆ తర్వాత రాష్ట్రంలో మనోహర్‌లాల్ ఖట్టర్ నాయకత్వంలోని బీజేపీ పాలనలోనూ ఇదే పరంపర కొనసాగింది. ఐదేండ్ల పాలనలో ఏడు సార్లు ట్రాన్స్‌ఫర్ అయ్యారు అశోక్ ఖేమ్కా. అవినీతిపై అశోక్ ఖేమ్కా కఠినవైఖరి కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనను తక్కువ ప్రొఫైల్‌గా భావించే విభాగాలకు పంపేవి. దీనిపై అశోక్ ఖేమ్కా పలు సందర్భాల్లో వ్యథ చెందారు. పురావస్తు, మ్యూజియంల విభాగానికి 53వ సారి ట్రాన్స్‌ఫర్ అయిన తర్వాత ఎక్స్ (అప్పుడు ట్విట్టర్) వేదికగా 2019లో ఆయన తన అసంతృప్తిని, బాధను వెలిబుచ్చారు. "నిజాయితీకి ప్రతిఫలం అవమానం" అని రాసుకొచ్చారు. అశోక్ ఖేమ్కాను ప్రభుత్వాలు తరచూ ఆర్కైవ్స్, పురావస్తు, ప్రింటింగ్, స్టేషనరీ వంటి తక్కువ స్థాయిగా భావించే విభాగాలకు బదిలీలు చేసేవి. 2022 అక్టోబర్‌లో హర్యానా ప్రభుత్వం ఇతరులను కార్యదర్శి స్థాయికి పదోన్నతిని కల్పిస్తూ.. అశోక్ ఖేమ్కాను మాత్రం విస్మరించింది. ఆ సమయంలో దీనిపై ఆయన ఎక్స్ వేదికగా తన ఆవేదనను, నిరాశను వెలిబుచ్చారు.

అశోక్ ఖేమ్కా 57వ బదిలీ గతేడాది డిసెంబర్‌లో జరిగింది. ఆ సమయంలో ఆయన రవాణా శాఖ అదనపు కార్యదర్శిగా నియమితులయ్యారు. తన పదవీవిరమణకు కేవలం నాలుగు నెలల సమయం ముందు ఆయనకు ఈ పోస్టింగ్ వచ్చింది.

ఎవరు ఈ అశోక్ ఖేమ్కా?

ఈయన పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఏప్రిల్ 30, 1965న ఒక సాధారణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి శంకర్‌లాల్ ఖేమ్కా ఒక జ్యూట్ మిల్లులో అకౌంటెంట్‌గా పని చేశారు. ఆయన 1988లో ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బీ.టెక్ చేశారు. ఆ తర్వాత ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్‌లో ప్రత్యేక కలిగిన ఎంబీఏ డిగ్రీని, ఆర్థిక శాస్త్రంలో ఎంఏ డిగ్రీని, అలాగే పంజాబ్ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ లా డిగ్రీ (2016-19 మధ్యలో) పొందారు.

ఆ ఒప్పందం రద్దుతో జాతీయస్థాయిలో ఆయనపేరు

2012లో హర్యానా భూసమీకరణ మరియు హోల్డింగ్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా అశోక్ ఖేమ్కా వ్యవహరించారు. ఆ సమయంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు సంబంధించిన స్కైలైట్ హాస్పిటాలిటీకి, గురుగ్రామ్‌లోని మనేసర్-షికోపూర్‌లోని రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్ఎఫ్‌కి మధ్య జరిగిన 3.5 ఎకరాల భూ ఒప్పందాన్ని రద్దు చేయటంతో ఖేమ్కా పేరు జాతీయస్థాయిలో పెద్ద ఎత్తున వినబడింది. ఆ తర్వాత ఖేమ్కా బదిలీ అయ్యారు.

ఇటాలియన్ ఓపెన్‌కు జకోవిచ్ దూరం



సెర్బియా స్టార్ ఆటగాడు నొవాక్ జకోవిచ్ ఇటాలియన్ ఓపెన్‌కు టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. మాడ్రిడ్ ఓపెన్‌లో రెండోరౌండ్‌లోనే ఓటమిపాలైన జకోవిచ్.. ఇటాలియన్ ఓపెన్ ఎటిపి మాస్టర్స్ 1000 నుంచి నిష్క్రమిస్తున్నట్లు మంగళవారం వెల్లడించాడు. ఇటాలియన్ ఓపెన్‌ను ఆరుసార్లు జకోవిచ్ చేజిక్కించుకున్నాడు. ఈ టైటిల్‌ను అత్యధికంగా రఫెల్ నాదల్ (12సార్లు) చేజిక్కించుకోగా.. ఆ తర్వాత జకోవిచ్ రెండోస్థానంలో ఉన్నాడు. అలాగే ఈ టోర్నీలో ఆడిన 80మ్యాచుల్లో 68మ్యాచుల్లో గెలుపొందాడు. 2022లో చివరిసారిగా జకోవిచ్ ఈ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. టాప్‌సీడ్ సిన్నర్ 2025లో మూడునెలల డోపింగ్ నిషేధం తర్వాత తొలిసారి ఈ టోర్నీ బరిలోకి దిగనున్నాడు.

వంద రోజుల పాలనలో పరువు గోవిందా!

ట్రంప్ రెండోసారి పాలనలో అప్రదిష్ట మూటకట్టుకున్న అమెరికా
కొంపముంచుతున్న విధానాలు...వాచాలత...యుద్ధోన్మాదం
కార్పొరేట్ శక్తులకు అండదండలు
వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం



ట్రంప్

వాషింగ్టన్ : రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ వంద రోజుల పాలన పూర్తి చేసుకున్నారు. ఈ కాలంలో ప్రపంచ దేశాలలో అమెరికా పేరు ప్రతిష్టలు బాగా దిగజారిపోయాయి. అయితే దేశాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని ట్రంప్ మహాశయుడు చెప్పుకుంటున్నారు. ట్రంప్ విమర్శకులు ఆయనను దుమ్మెత్తిపోస్తుంటే మద్దతుదారులు మాత్రం ప్రశంసలు కురిపిస్తున్నారు. ట్రంప్ నిర్ణయాలను ప్రతిపక్ష డెమొక్రాట్లు, తటస్థులే కాదు...సొంత రిపబ్లికన్ పార్టీలో కూడా వ్యతిరేకిస్తుండడం గమనార్హం.

ట్రంప్ తన వంద రోజుల పాలనలో పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడేందుకు ప్రయత్నించారు. నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన న్యాయ శాఖను ఓ ఆయుధంగా వాడుకున్నారు. జనవరి 6వ తేదీన తిరుగుబాటుదారులు చెలరేగి హింసకు తెగబడితే వారిని క్షమించి వదిలేశారు. తనకు సంక్రమించిన కార్యనిర్వాహక అధికారాలను ఉపయోగించుకుంటూ ప్రతినిధి సభను బేఖాతరు చేశారు. కార్యనిర్వాహక అధికారాలను దుర్వినియోగం చేయకుండా అడ్డుకున్న ఇన్స్‌పెక్టర్ జనరల్స్‌పై వేటు వేశారు. వలసవాదులతో పాటు పౌరులను సైతం ఎలాంటి ప్రక్రియలు పాటించకుండా దేశం నుండి బహిష్కరించారు.

బెదిరింపులు...దాడులు

న్యాయస్థానాలలో తనకు వ్యతిరేకంగా దాఖలైన కేసులను వాదిస్తున్న ప్రతిష్టాత్మక సంస్థల న్యాయవాదులను ట్రంప్ బెదిరించారు. యూదు వ్యతిరేకతపై పోరాటం ముసుగులో విశ్వవిద్యాలయాల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించే ప్రయత్నం చేశారు. ప్రపంచ వాణిజ్య వ్యవస్థను అతాలకుతలం చేసేలా పలు దేశాలపై సుంకాల దాడి చేశారు. కెనడా, పనామా, గ్రీన్‌ల్యాండ్‌పై దాడి చేస్తానంటూ పదే పదే హెచ్చరికలు చేశారు. ఫెడరల్ ప్రభుత్వాన్ని బిలియనీర్ల ఇష్టాఇష్టాలకు, లాభాలకు వదిలేశారు. ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న ఆయుధ పోటీకి ట్రంప్ ఆజ్యం పోశారు. ఫలితంగా అస్థిరత, ఘర్షణలు పెరిగిపోయాయి. ట్రంప్ తన వంద రోజుల పాలనలో కార్మికుల హక్కులపై తీవ్రమైన దాడి చేశారు. జాతి, లింగ పరమైన మైనారిటీలు కష్టపడి సాధించుకున్న హక్కులను కాలరాసే ప్రయత్నం చేశారు.

గందరగోళంగా సర్కారు పనితీరు

అమెరికా ప్రభుత్వ ఆంతరంగిక పనితీరు ఇప్పుడున్నంత గందరగోళంగా మునుపెన్నడూ లేదు. సొంత సమాజం, ప్రజలపై దాని వైఖరి దారుణంగా ఉంది. ప్రపంచ దేశాల విషయంలో దాని ఉద్దేశాలు సైతం గందరగోళానికి దారి తీస్తున్నాయి. ఫ్రాంక్లిన్ డొలానో రూజ్‌వెల్ట్ తొలి ప్రభుత్వ పాలన దాదాపుగా ఇలాగే ఉండేది. ట్రంప్ ప్రస్తుతం కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. విదేశీ లేదా స్వదేశీ శత్రువులు, పోటీదారుల నుండి కార్పొరేషన్లను కాపాడేందుకు ట్రంప్ తన అధికారాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. అందుకోసం యుద్ధ ప్రమాదాన్ని పెంచుతున్నారు. ఇక్కడ సమస్య ట్రంప్ మాత్రమే కాదు. సమస్య ట్రంప్ మాత్రమే అయితే ఆయనను పదవి నుండి తొలగించవచ్చు లేదా పదవీ విరమణ చేయించవచ్చు. దాంతో సమస్య పరిష్కారమవుతుంది. ఇది డెమొక్రటిక్ పార్టీ ఇస్తున్న సందేశం. ఈ నేపథ్యంలో ట్రంప్-1, బైడెన్, ట్రంప్-2 ప్రభుత్వాల విధానాలను పరిశీలించాల్సిన అవసరమున్నదని డెమొక్రాట్ల అభిప్రాయం.

దొందూ దొందే

తొలిసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ట్రంప్ పన్ను కోతలను ఆమోదించారు. వాటినే బైడెన్ కొనసాగించారు. కార్పొరేట్ సంస్థలకు అందిస్తున్న సబ్సిడీలు కూడా కొనసాగుతున్నాయి. ట్రంప్‌తో పాటు బైడెన్ కూడా ప్రపంచంలో ఆయుధ అమ్మకాలు పెరగడానికి కారణమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణలకు ఆజ్యం పోశారు. ట్రంప్ ప్రారంభించిన రక్షణాత్మక వాణిజ్యాన్ని బైడెన్ విస్తరించారు. ఇప్పుడు అది మరింతగా విస్తరించింది. ట్రంప్ తన వంద రోజుల పాలనలో 17 లక్షల మందిని స్వదేశాలకు తిప్పిపంపారు. ట్రంప్ తొలి ప్రభుత్వ హయాంలో 12 లక్షల మంది దేశ బహిష్కరణకు గురయ్యారు. యుద్ధ సమయంలో తనకు లభించే అపరిమిత అధికారాలను ఉపయోగించుకొని ఆ సంఖ్యను మరింత పెంచాలని ట్రంప్ యోచిస్తున్నారు. చట్టాన్ని ఎంత మాత్రం పట్టించుకోకుండా లక్షలాది మందిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. యుద్ధోన్మాది ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడం, ఇంధన రంగంలో డ్రిల్లింగ్‌కు అనుకూలంగా వ్యవహరించడంతో పాటు దానికి ప్రాధాన్యత కల్పించడం, శిలాజ ఇంధన ఉత్పత్తిని చేపట్టడం వంటి చర్యలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

పెరుగుతున్న నిరసనల హోరు

కార్పొరేట్ బిలియనీర్లు గతంలో బైడెన్‌కు నిధులు సమకూర్చారు. ఇప్పుడు అదే విధంగా ట్రంప్ జేబులు కూడా నింపుతున్నారు. ట్రంప్ అయినా, బైడెన్ అయినా కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాసే వారే. ట్రంప్ తొలిసారి దేశాధ్యక్షుడు అయినప్పుడు కూడా అమెరికాలో రాజకీయ అశాంతి చెలరేగింది. ఆయన విధానాలు, వాచాలత ప్రజల ఆగ్రహానికి కారణమయ్యాయి. ఇప్పుడూ అదే జరుగుతోంది. కాకుంటే కొంచెం హెచ్చు స్థాయిలో నిరసనలు చోటుచేసుకుంటున్నాయి. 2016కు ముందున్న కాలంతో పోలిస్తే ఇప్పుడు అమెరికాలో ప్రజలు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి తన నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. 2017లో చార్లోట్స్‌విల్లేలో జరిగిన 'యునైట్ ది రైట్' ర్యాలీని గుర్తు చేసుకోండి. ఆ ఏడాది జనవరిలో జరిగిన మహిళా మార్చ్ అమెరికా చరిత్రలోనే అతి పెద్ద ప్రదర్శనగా నిలిచి ఒకే రోజు లక్షలాది మందిని ఆకర్షించింది. జార్జ్ ఫ్లాయిడ్ హత్యతో చోటుచేసుకున్న జాతీయ, అంతర్జాతీయ పరిణామాల కారణంగా 2020 మే నుండి నిరసనలు గరిష్ట స్థాయికి చేరాయి. అమెరికాలో పెద్ద సంఖ్యలో ప్రజలు ర్యాలీలు తీశారు. వీటిలో 1.4 కోట్ల నుండి 2.5 కోట్ల మంది భాగస్వాములయ్యారని అంచనా. ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలలో ప్రదర్శనలు జరిగాయి. దీంతో యావత్ ప్రపంచం అమెరికానే చూస్తూ ఉండిపోయింది. బైడెన్ పదవీకాలంలో నిరసనలు అంతగా జరిగి ఉండకపోవచ్చు. కానీ పోలీస్ హత్యలకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి. రాజకీయ అశాంతి, ప్రతిఘటన అనేవి 2016కు ముందున్న స్థాయికి చేరలేదు కానీ గాజాలో ఇజ్రాయిల్ ఆక్రమణలకు అమెరికా మద్దతు తెలపడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు.

ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పరిపాలన మరింత కఠినంగా సాగుతోంది. గాజాలో నరమేధం సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతు కొనసాగుతూనే ఉంది. 2017 ఫిబ్రవరిలో జరిగిన నిరసనలతో పోలిస్తే ఈ ఫిబ్రవరిలో రెట్టింపు సంఖ్యలో ప్రదర్శనలు జరిగాయి. ఏదేమైనా ట్రంప్ అజెండాకు వ్యతిరేకంగా అమెరికాలో వెల్లువెత్తుతున్న నిరసనలు సజీవంగానే ఉంటున్నాయి. పైగా అవి నానాటికీ ఉధృతమవుతున్నాయి. ట్రంప్ తన వంద రోజుల పాలనలో సాధించిన విజయాలు ఏవైనా ఉంటే అవన్నీ ఈ నిరసన హోరులో కొట్టుకుపోయాయి.

మారిన అమరావతి ఆహ్వాన పత్రిక



ప్రధాని, ముఖ్యమంత్రి పేర్లతో తొలి ముద్రణ

- పవన్ కళ్యాణ్ పేరుతో కొత్తగా ముద్రణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం ముద్రించిన రాజధాని అమరావతి ఆహ్వాన పత్రిక మారింది. రాజధాని నిర్మాణ పనులు పున: ప్రారంభం కార్యక్రమం 2వ తేదిన జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరు లేకుండానే రాష్ట్రప్రభుత్వం ముద్రించింది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్లతోనే ప్రభుత్వం ముద్రించింది. వీటినే అందరికీ పంపిణీ చేశారు కూడా! రాజధాని గ్రామాల్లోని ప్రజలకు కూడా సిఎం, పిఎం పేర్లతో ఉన్న ఆహ్వానపత్రికలనే అందించారు. ఆహ్వాన పత్రికలో పవన్ కళ్యాణ్ పేరు లేకపోవడంతో జనసేన నేతలు, నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడి పేరు లేకుండా ఆహ్వాన పత్రికలు ఏలా ముద్రిస్తారని మండిపడ్డారు. దీంతో రాష్ట్రప్రభుత్వం పవన్ కళ్యాణ్ పేరుతో మరోసారి ఆహ్వాన పత్రికలను ముద్రించింది.



మలి ముద్రణలో ఉపముఖ్యమంత్రి పేరు చేర్చిన వైనం

విజయ్‌కుమార్‌రెడ్డి బెయిల్ కేసు మూసివేత

ప్రజాశక్తి, అమరావతి

ప్రభుత్వ ప్రకటన జారీ, బిల్లుల చెల్లింపులపై ఏసిబి నమోదు చేసిన కేసు విచారణకు సహకరిస్తామని విజయ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీని నమోదు చేసుకున్న హైకోర్టు ఆయన దాఖలు చేసి బెయిల్ పిటిషన్‌ను మూసేసింది. దర్యాప్తునకు సహకరించకుంటే తదుపరి చర్యలు తీసుకునేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసిబి)కి అధికారం ఉందని స్పష్టం చేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నోటీసులకు అనుగుణంగా విచారణకు హాజరయ్యారని, దర్యాప్తునకు సహకరిస్తామని న్యాయవాది చెప్పడంతో అందుకు హైకోర్టు అనుమతిచ్చింది. దర్యాప్తునకు సహకరించకపోతే చర్యలు తీసుకునే వీలుండాలని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనను కూడా ఆమోదించింది.

'ఉపాధి' పనులు ఎమ్మెల్యే నిర్ణయిస్తారా?

ప్రజాశక్తి, అమరావతి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల విషయంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంపై హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఉపాధి పనుల్లో ఎలా జోక్యం చేసుకుంటారని విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజును ప్రశ్నించింది. కలెక్టర్ కూడా పరిపాలనా అనుమతులు ఎలా ఇస్తారని నిలదీసింది. ఆ పనుల అనుమతులపై స్టే ఇచ్చింది. పనులు ఏం చేయాలో గ్రామసభలో తీర్మానించాలనే నిబంధన ఉందని గుర్తు చేసింది. కలెక్టర్ సైతం గ్రామ సభతీర్మానికి విరుద్ధంగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించింది. ఎమ్మెల్యే చెప్పారని చేస్తే ఎలాగని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ప్రశ్నించింది. విజయనగరం జిల్లా, మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన పనుల విషయంలో ఆయా గ్రామసభలు, గ్రామ పంచాయతీలు చేసిన తీర్మానానికి విరుద్ధంగా ఎమ్మెల్యే సవరించి చేయిస్తున్నారంటూ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు పిల్ వేశారు. మొత్తం 889 పనులను ఎమ్మెల్యే సవరించారని, కలెక్టర్ కూడా ఎమ్మెల్యే చెప్పిన విధంగా ఆయా పనులకు నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులు మంజూరు చేశారని పిటిషనర్ వాదన. ఆపనులపై స్టే ఇచ్చిన హైకోర్టు విచారణను మే 7వ తేదీకి వాయిదా వేసింది.

ఇంగ్లీషు నుంచి తెలుగు.. అంబటి వాదనలు

- నవ్వుల పువ్వులు

ప్రజాశక్తి, అమరావతి

వ్యక్తిగతంగా కోర్టుకు వచ్చిన స్వయంగా వాదనలు వినిస్తున్న మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు బుధవారం హైకోర్టులో నవ్వులు పూయించారు. తనపై, కుటుంబసభ్యులపై, వైఎస్ జగన్‌పై సోషల్ మీడియాలో చేస్తున్న అసభ్య పోస్టులపై చర్యలు తీసుకోవాలన్న ఫిర్యాదు మేరకు గుంటూరు పోలీసులు కేసు నమోదు చేయడం లేదంటూ అంబటి రాంబాబు పిటిషన్ వేశారు. ఇంగ్లీష్ లో వాదనలు మొదలుపెట్టిన అంబటి రాంబాబు కొద్దిసేపటికి తెలుగులో వాదించడం ప్రారంభించారు. దీనిపై జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు స్పందిస్తూ, మీకు తెలుగులో వాదనలు చెప్పే అవకాశం ఇస్తే మిమ్మల్ని మేం ఆపలేమని వ్యాఖ్యానించడంతో కోర్టు హాలు నవ్వులతో నిండిపోయింది. రాంబాబు వాదనలు వినిపిస్తూ, గుంటూరు, పట్టాభిపురం పోలీసులకు తాను మొత్తం ఐదు ఫిర్యాదులు చేస్తే హైకోర్టుకు వచ్చాన నాలుగు కేసులు నమోదు చేశారని తెలిపారు. మరో ఫిర్యాదులో కేసు నమోదు చేయడం లేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదిస్తూ, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. విచారణను జూన్ 18కి వాయిదా పడింది.

టిటిడి మందుల కొనుగోళ్లపై స్టేకు నిరాకరణ

ప్రజాశక్తి, అమరావతి

తిరుమల, తిరుపతి దేవస్థానాల (టిటిడి) పరిధిలోని ఆసుపత్రులకు మందుల సరఫరాకు టిటిడి సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌పై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. టెండర్ ప్రక్రియను కొనసాగించుకునేందుకు టిటిడికి అనుమతినిచ్చింది. టెండర్ ఖరారు తామిచ్చే తుది తీర్పుకు లోబడి ఉండాలని షరతు విధిస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మందులు, సర్జికల్ ఐటమ్స్, ల్యాబ్ ఉపకరణాల సరఫరా టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు టిటిడి కొన్ని బ్రాండ్ల ఔషధ కంపెనీలకే ప్రాధాన్యతనిస్తోందని, అన్నీ కంపెనీలకు ఇవ్వడం లేదంటూ ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె. బలరాముడువేసిన పిల్‌పై విచారణను జూన్‌కు వాయిదా వేసింది.

తెల్ల బంగారం.. ధరలు పాతాళం

- దిగుబడి బాగున్నా.. ధర నిల్
- గత ఏడాది క్వింటా రూ.10 వేలకు పైగా పలికిన వైనం
- ప్రస్తుతం రూ.7 వేలకే పరిమితం
- ఆందోళనలో పత్తి రైతులు



ప్రజాశక్తి - చాపాడు (వైఎస్ఆర్ జిల్లా)

ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగైన పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. ధరలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. పంట సాగు సమయంలో ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికి దిగుబడి చేతికి అందివచ్చే సమయానికి తగ్గుముఖం పట్టినది. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. గత ఏడాది పత్తి పంటకు గిట్టుబాటు ధర ఉండటంతో ఎక్కువ మంది రైతులు పంట సాగు చేపట్టారు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఎకరా సాగుకు రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు ఖర్చులు అయ్యాయని పేర్కొంటున్నారు. కిలో పత్తి ధర ప్రారంభంలో రూ. 85 నుంచి రూ. 90 వరకు పలికింది. ప్రస్తుతం రూ.70కు తగ్గింది. గతంలో సిసిఐ రూ. 98కి కొనుగోలు చేసింది. ఈ ఏడాది దిగుబడి చేతికి అంది వచ్చిన తరువాత రూ. 65 నుంచి రూ. 72 కు చేరింది. గతంలో దిగుబడి ఆశాజనకంగా లేని సమయంలో క్వింటా రూ.105 వరకు పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు కూడా పత్తి రైతులు నోచుకోవడంలేదు. జిల్లాలో మైలవరం, రాజుపాలెం, వేముల, తొండూరు, విఎన్‌పల్లి, పెద్దముడియం మండలాల్లో ఐదు వేల ఎకరాలకు పైగా, కొండాపురం ,కలస పాడు, బి.మఠం, పోరుమామిళ్ల, ఖాజీపేట, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, యర్రగుంట్ల , కమలాపురం, వల్లూరు మండలాలలో రెండు వేల ఎకరాల వరకూ, మిగిలిన మండలాల్లో 50 ఎకరాలలోపు రైతులు పత్తి పంటను చేశారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో జిల్లాలో 60 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. సాధారణంగా ఎకరాకు 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుంది. ఈ ఏడాది చీడపీడలు, గులాబి పురుగు లోకం వలన 15 క్వింటాళ్ల లోపు దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పత్తి పంట సాగుకు రూ. 40 వేల నుంచి 50 వేల వరకు సాగు ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం ధరలు రూ.7వేల లోపు మాత్రమే ఉండడంతో ఏమాత్రం ఆదాయం సమకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 క్వింటాళ్లకు పైబడి దిగుబడి వచ్చిన రైతులకు మాత్రమే కాస్త ఆదాయం వస్తుంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిట్టుబాటు ధర అమలు అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

దళారుల దగా...

రైతులకు వేర్వేరు కారణాలు చూపి దళారులు మభ్యపెట్టేవారు. నాణ్యత, రంగు లేదని సాకులు చూపుతూ తక్కువ ధర నిర్ణయిస్తున్నారు. దళారీలు పత్తి రైతుల వద్ద తక్కువ ధరలకు సేకరించి పత్తిని ప్రొద్దుటూరు, గుంటూరు, నంద్యాల, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ మిల్లులలో అమ్ముకుంటూ అధిక ధరలు సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో తూకాలు వేసే సందర్భంలో కూడా చాలావరకు మోసాలకు పాల్పడుతున్నప్పటికీ కట్టడి చేయడంలో అధికారులు విఫలమౌతున్నారు. ప్రస్తుతం ధరలు తగ్గడంతో పత్తి కోసం వ్యాపారులు గ్రామాల బాట పట్టిన రైతులు అమ్మకాలకు విముఖత చూపుతున్నారు. ఖాజీపేట మండలం తుడుమలదిన్నె, నందిపాడు, తవ్వారుపల్లె, గుత్తికొట్టాలు, శాంతినగరం గ్రామాల పరిధిలో రైతుల వద్ద టన్నుల కొద్దీ పత్తి నిల్వలు అధికంగా ఉన్నాయి. గహలలో ఏ రైతు వద్ద చూసినా పత్తి నిల్వలు అధికంగా ఉన్నాయి. కొన్ని గ్రామాలలో పంటపొలాలలోనే పత్తి దిగుబడులను నిల్వ ఉంచారు. ఎండకు, వానకు పత్తి దెబ్బతింటున్నదని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పత్తి అమ్మకాలు చేయకుండా నిల్వ ఉంచాం

పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో అమ్మకాలు చేపట్టకుండా నిలువ ఉంచాం. ఈ ఏడాది ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పది ఎకరాలలో పత్తి పంటను సాగు చేపట్టాను. 100 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర వస్తుందని వేచి చూస్తున్నాం. ప్రస్తుతం ఉన్న ధరలతో సాగు ఖర్చులు సరిపోతాయి. ప్రభుత్వం పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధరను కల్పించాలి.

సుబ్బారెడ్డి రైతు, నందిపాడు, ఖాజీపేట మండలం.

గిట్టుబాటు ధర కల్పించాలి

పత్తి పంటకు ప్రభుత్వం రూ. 10 వేల వరకు గిట్టుబాటు ధర కల్పించాలి ప్రస్తుతం పెరిగిన సాగు ఖర్చుల వల్ల ఎకరాకు రూ. 50 వేలకు పైగా ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం క్వింటా రూ. 7వేలు మాత్రమే ధరలు పలుకుతున్నాయి. ధరలు పెరుగుతాయని ప్రస్తుతం పత్తి అమ్మకాలు చేపట్టడం లేదు. రెండు సంవత్సరాలకు సంబంధించిన దిగుబడిని నిల్వ ఉంచాం ధరలు పెరుగుతాయని వేచి చూస్తున్నాం.

-నాగేశ్వర్ రెడ్డి, గాంధీనగరం, చాపాడు మండలం.

అకాల వర్షం... రైతన్నకు టెన్షన్

- పొర్లు గ్రామంలో పిడుగు పడి బాలుడు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి, శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లాలో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పిడుగుపడి బాలుడు మృతి చెందాడు. ఎస్.కోట మండలంలో బుధవారం ఉదయం నుండి జల్లులు జల్లులుగా వర్షం కురిసింది. కొన్నిచోట్ల పొలాల్లో వర్షపు నీరు నిల్వ పోయింది. నువ్వు పంటకు నష్టం వాటిల్లిది. ఈదురు గాలులకు పలుచోట్ల మామిడికాయలు రాలిపోయాయి. పట్టణంలోని విశాఖ-అరకు ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిల్చిపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. వేపాడ: మండలంలోని ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. దీంతో, పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బొబ్బిలి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి, బుధవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో, రైతుల్లో టెన్షన్ నెలకొంది. వర్షాలకు మొక్కజొన్న, వరి పంట తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గున్నతోటవలస, పెంట, పనుకువలస, కొత్తపెంట, తదితర గ్రామాల్లో మొక్కజొన్న తడిపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఎం.బూర్జవలసలో వరి పంట తడిసిపోయింది. ఈ పంటకు కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు.

ఎస్.కోట మండలం దారపర్తి పంచాయతీ పొర్లు గ్రామంలో వర్షంతోపాటు పిడుగు పడంతో 3వ తరగతి చదువుతున్న కేరంగి కిరణ్ (8 మృతి చెందాడు. ఒక ఆవు కూడా మృత్యువాత పడింది. కిరణ్, మరో యువకుడు బోయిన అనిల్ (19) కలసి పొలంలో పశువులు కాస్తున్నారు. సాయంత్రం అకాల వర్షం పడడంతో వీరు ఓ చెట్టు కింద చేరారు. ఈ నేపథ్యంలో పిడుగు పడడంతో కిరణ్, అనిల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఎస్.కోటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, కిరణ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన అనిల్‌ను విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పిడుగుపాటుకు ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.



పెళ్లి బృందంపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి- వంగర (విజయనగరం జిల్లా)

ఓ వివాహ వేడుకల్లో తేనెటీగలు దాడితో పలువురు అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.... శివ్వాంలో బుధవారం ఓ వివాహ వేడుకల్లో పలువురు పెండ్లి కుమార్తెను తీసుకువచ్చేందుకు గ్రామ శివారులో ఉన్న ఓ మర్రిచెట్టు వద్దకు వెళ్లారు. వారిపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో, గ్రామానికి చెందిన బిల్లాన రామారావు, అలజంగి ప్రేమ్ కుమార్, బిల్లాన ప్రతాప్, కుప్పిలి నితిన్, కిరణ్‌తోపాటు మరికొందరు అస్వస్థతకు గురయ్యారు. వీరిని గ్రామస్తులు వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి సిహెచ్ జ్యోతి వారికి చికిత్స అదించారు.

దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి- రామచంద్రపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామం పెట్రోలు బంకు వద్ద దారి దోపిడీకి పాల్పడిన నిందితులను బుధవారం అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... గత నెల 27న వీరేశగుళ్లపెట్రోలు బంకు వద్ద వరి కోత యంత్రానికి డీజిల్ కొట్టించడానికి తమిళనాడుకు చెందిన వ్యక్తి వచ్చాడు. ఆయన నుంచి గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లపై వచ్చి రూ.10 వేలు నగదు, సెల్‌ఫోన్ అపహరించారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. రామచంద్రపురం సిఐ వెంకటనారాయణకు వచ్చిన సమాచారంతో బుధవారం ఉదయం ద్రాక్షారామం ఎస్ఐ ఎం.లక్ష్మణ్, తన సిబ్బందితో కలిసి వేగాయమ్మపేట వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. దోపిడికి పాల్పడిన నలుగురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారి నుంచి ఘటన సమయంలో ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్లు, రూ.200 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దోపిడికి పాల్పడిన వారిలో దొండపాటి కుమార్ మినహా మిగతా ముగ్గురు మైనర్లుగా గుర్తించామన్నారు.. మేజిస్ట్రేటు ఆదేశాల కుమార్‌ను రిమాండుకు, మిగతా ముగ్గురిని రాజమహేంద్రవరం జువైవల్ హోంకు తరలించామని ఎస్ఐ తెలిపారు.



'మేడే' రోజైనా ఎస్‌వియులో జీతాలు అందేనా..?

ప్రజాశక్తి - క్యాంపస్ (తరుపతి)

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది, టైం స్కేల్, ఇతర ఒప్పంద ఉద్యోగులు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా బోధనేతర సంఘం నేతలు మాట్లాడుతూ ఉద్యోగులు అరకొర జీతంతో ఇంటి బాడిగులు, నిత్యవసర వస్తువులు కొనుక్కోవడంతో పాటు కొన్ని వస్తువులకు సంబంధించి, ఇంటి వస్తువుల ఈఎంఐలు కట్టవలసి వస్తుందని అన్నారు. రెండు నెలలుగా డబ్బు చెల్లించకపోవడంతో ఈఎంఐలు లాప్స్ అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీతం ఎంత వచ్చినా ఉద్యోగులు కొన్ని కమిట్మెంట్స్ ఈఎంఐలు, ఎల్ఐసి పాలసీలు తదితరాలకు సంబంధించి చెల్లింపులు ప్రతినెలా చేస్తుండడం ద్వారా వారి యొక్క ఆదాయంలో 80శాతం ఇలాంటి ఖర్చులకు సరిపోతుందని అన్నారు. దీన్ని దష్టిలో ఉంచుకొని వర్సిటీ ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయి సచివాలయంలోని అధికారులతో సంప్రదించి సత్వరమే వేతన జీవుల జీతాలు అందేలా కషి చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే వర్సిటీ రిజిస్ట్రార్‌తో చర్చించినట్లు తెలిపారు. మేడే సందర్భంగా శ్రామికుల బతుకు జీవుల వేతన వేతనాలు అందేలా చూడాలని ఎస్వీయూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వరా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. మే డే సందర్భంగా ప్రభుత్వం శ్రమజీవులకు జీతాలు వేసి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆశిద్దాం.



ఘనంగా శ్రీచైతన్య స్కూల్ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ ముగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు శ్రీచైతన్య స్కూల్ వెల్లడించింది. దీన్ని విజయవాడంలోని గోసాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జోన్స్ నుండి వచ్చిన 1300 మందికి పైగా శ్రీచైతన్య విద్యార్థులు దీనికి హాజరయ్యారని ఆ సంస్థ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. వాలీబాల్, త్రోబాల్, షటిల్ బాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్ వంటి పోటీలను నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమా నికి శ్రీచైతన్య స్కూల్ విజయవాడ జోన్ ఇజిఎం మురళీ కృష్ణ ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన విజయవాడ సిటీ బ్రాంచెస్ టీంకు బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులను, పాల్గొన్న వారిని శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, పార్థసారథి, సురేష్, చిన్మయ్ శ్రీనివాస్, రీజినల్ ఇన్‌ఛార్జ్‌లు, పిఇటిలు పాల్గొన్నారు.

మంచు మోహన్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులపై అన్యాయమైన ఆర్థిక వసూళ్లు, మెస్ బిల్లుల పేరుతో దోపిడీ, హాల్ టికెట్లను నిలిపివేత వంటి ఘటనలపై భారత విద్యార్థి ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ యాజమాన్యం గత కొన్ని సంవత్సరాలుగా డే స్కాలర్స్ విద్యార్థుల నుంచి నెలకు రూ.20వేల వరకు మెస్ బిల్లులు వసూలు చేస్తోంది. విద్యార్థులు మెస్ ఉపయోగించకపోయినా ఈ బిల్లులను తప్పనిసరిగా చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తుంది. ఈ దోపిడీ తారాస్థాయికి చేరి, మే 1వ తేదీ నుండి ప్రారంభమయ్యే నాలుగో సెమిస్టర్ పరీక్షల కోసం హాల్ టికెట్లు ఇవ్వకుండా, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, ఫైన్లు పూర్తిగా చెల్లించిన తర్వాత మాత్రమే జారీ చేస్తామని యాజమాన్యం బెదిరిస్తోంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు అక్బర్, జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఈ విధమైన ఆర్థిక దాడులు అన్యాయమని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే చర్యని, యూనివర్సిటీ మేనేజింగ్ ట్రస్టీ, చైర్మన్ మంచు మోహన్ బాబు, ట్రస్టీ మంచు విష్ణు పై క్రిమినల్ కేసు నమోదు చేసి, బాధిత విద్యార్థులకు హాల్ టికెట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏపిఎస్సిహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తికి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ కి ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే, మోహన్ బాబు యూనివర్సిటీని ముట్టడించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో • ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి- విఆర్.పురం (అల్లూరి జిల్లా)

ద్విచక్ర వాహనాన్ని బజాజ్ ఆటో బలంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం శబరిరాయిగూడెం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రామవరం పంచాయతీకి చెందిన కారం చంద్రయ్య, మడకం నరేష్ విఆర్ పురంలో క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లో పాల్గొని తిరిగి తమ స్వగ్రామం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వారిని బజాజ్ మ్యాక్స్ ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమించి నరేష్ చింతూరు ఏరియా ఆస్పత్రిలోనూ, కారం చంద్రయ్య భద్రాచలం ఆస్పత్రిలోనూ మృతి చెందారు. విఆర్.పురం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్

- కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌కి ఎంపి సానా సతీష్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ కోరారు. బుధవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌తో ఎంపి సానా సతీష్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రానికి సంబంధించిన చట్టం, న్యాయ వ్యవస్థకు చెందిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో న్యాయ మౌలిక సదుపాయాలను బలోపేతం, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల సంఖ్య పెంపు, ఖాళీలను భర్తీ చేయడం, రాష్ట్రంలోని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో న్యాయం పొందే అవకాశాన్ని మెరుగుపరచడం వంటి డిమాండ్లపై చర్చించారు. రాష్ట్రంలో చట్టాన్ని అమలు చేసే సంస్థలు, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం, కేసుల పరిష్కారాలలో జాప్యం, కోర్టు సౌకర్యాల ఆధునీకరణ ఆవశ్యకతకు సంబంధించిన అంశాలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

కేరళ సిఎం ముఖ్య కార్యదర్శిపై సిబిఐ విచారణపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్య కార్యదర్శి కె.ఎం అబ్రహం అక్రమాస్తుల ఆరోపణలపై సిబిఐ విచారణను నిలిపివేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. అబ్రహం కేరళ మౌలికసదుపాయాల మూలధన నిధి బోర్డు (కెఐఐఎఫ్‌బి) సిఇఒగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. అబ్రహం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్‌మోహన్‌లతో కూడిన ధర్మాసనం స్టే విధిస్తూ సిబిఐకి నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్‌లో కేరళ హైకోర్టు ఈ కేసులో అబ్రహంపై విచారణ చేపట్టాలని సిబిఐని ఆదేశించిన సంగతి తెలిసిందే.

విపత్తు నిర్వహణపై ఉన్నతస్థాయి కమిటీ

న్యూఢిల్లీ : విపత్తు నిర్వహణపై ఉన్నతస్థాయి కమిటీని కేంద్రం బుధవారం నియమించింది. ఈ కమిటీకి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షత వహించనున్నారు. వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి అయోగ్ ఉపాధ్యక్షులు సుమన్ బెరీ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. 2005 విపత్తు నిర్వహణ చట్టం (2005లో 53) సెక్షన్ 8బిలోని సబ్ సెక్షన్ (2) అధికారాలను వినియోగించుకుని ఈ కమిటీని నియమించినట్లు హోం శాఖ నోటిఫికేషన్ పేర్కొంది. విపత్తుల సమయాల్లో వివిధ మంత్రిత్వ శాఖలకు, సంస్థల మధ్య విధాన నిర్ణయాలను మార్గనిర్దేశం చేయడం, సమన్వయపరచడంలో ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుందని తెలిపింది.

విక్టరీ డే వేడుకలకు మోడీ దూరం

మాస్కో : వచ్చే నెల్లో రష్యాలోనిమాస్కోలో జరగనున్న విక్టరీ డే 80వ వార్షికోత్సవ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరు కావడం లేదు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ బుధవారం ప్రకటించారు. మోడీకి బదులుగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారని తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా నిర్వహించే పరేడ్‌కు రావాల్సిందిగా మోడీని రష్యా ఆహ్వానించింది. అయితే ప్రధానికి బదులుగా రక్షణ మంత్రి హాజరవుతారని భారత్ తెలియచేసినట్లు ఆయన తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ విక్టరీ పరేడ్‌కు హాజరవుతున్నట్లు చైనా ధృవీకరించింది. మొత్తంగా ఈ కార్యక్రమానికి 20మంది వరకు విదేశీ నేతలు హాజరవుతున్నారని మాస్కో తెలిపింది.


ఎవరెస్ట్ అధిరోహణకు కొత్త షరతులు

- 7వేల మీటర్లు అధిరోహిస్తేనే ఇకపై అవకాశం

ఖాట్మండు : ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించే క్రమంలో చోటు చేసుకుంటున్న మరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని నేపాల్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో 7వేల మీటర్లకు పైగా ఎత్తు గల శిఖరాలను అధిరోహించిన పర్వతారోహకులనే మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించడానికి అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోందని మీడియా వార్తలు తెలిపాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడానికి ప్రపంచ వ్యాప్తంగా వేలాదిమంది పర్వతారోహకులు ఆసక్తి చూపిస్తూ వుంటారు. 1953లో తొలిసారిగా ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నార్కేలు ఈ పర్వతాన్ని అధిరోహించినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 9వేల మంది పర్వతారోహకులు విజయవంతంగా ఈ శిఖరాన్ని అధిరోహించారు. మరో 300మంది ఈ సందర్భంగా ప్రాణాలు పోగొట్టుకున్నారు. కేవలం ఎక్కాలన్న ఆసక్తి, ఆకాంక్ష వున్నంత మాత్రాన ఎక్కడం ఇకపై సాధ్యం కాదని, ముందుగా మిమ్మల్ని మీరు రుజువు చేసుకున్న వారికే ఇకపై ఎవరెస్ట్‌ను అధిరోహించే అవకాశం వస్తుందని నేపాల్ ప్రభుత్వం పేర్కొంటోంది. ఇందుకు కొత్త ముసాయిదా బిల్లు రూపొందించింది. ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎగువ సభ ఆమోదించింది. కొన్ని మార్పులు, చేర్పులతో ఈ ముసాయిదా బిల్లు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందుతుందని భావిస్తున్నారు. ఎవరెస్ట్‌పైకి చేరే క్రమంలో ఎక్కువమంది చనిపోవడం, పర్వత శిఖరాలపై చెత్త పేరుకుపోవడం వంటి కారణాల వల్ల నేపాల్ ఈ నిర్ణయం తీసుకుంది.

యుపిలో మరో ఘోరం

- 16 ఏళ్ల దళిత బాలికపై సామూహిక లైంగికదాడి
- కేసు నమోదు.. నిందితుల కోసం పోలీసుల గాలింపు



లక్నో : బిజెపి పాలిత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో మరో దారుణం చోటు చేసుకున్నది. ఇక్కడ మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. ఈ సారి కౌశాంబి జిల్లాలో ఈ ఘోరం చోటు చేసుకున్నది. జిల్లాలో ఒక 16 ఏళ్ల దళిత బాలికపై కొందరు దుర్మార్గులు సామూహిక లైంగికదాడికి ఒడిగట్టారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనపై దళిత, మహిళా సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. రాష్ట్రంలో దళితులు, మహిళల భద్రత విషయంలో బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత తీరుపై ఆందోళనను వెలిబుచ్చాయి.

పోలీసులు, బాధితురాలి కుటుంబీకుల కథనం ప్రకారం.. ఏప్రిల్ 24న బాధితురాలు అదృశ్యమైనట్టు మిస్సింగ్ రిపోర్ట్ నమోదైంది. తన కూతురిపై సామూహిక లైంగికదాడికి ఒడిగట్టారని వారి గ్రామానికే చెందిన శైలేంద్ర సరోజ్ అలియాస్ జహీద్, అతని స్నేహితుడు షేరు అలియాస్ నాజర్ అహ్మద్, మరొక గుర్తుతెలియని వ్యక్తిపై ఏప్రిల్ 27న బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని బయట ఎవరికైనా చెప్తే చంపేస్తామని తన కూతురిని బెదిరించారని కూడా పేర్కొన్నాడు. దీంతో ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసు అధికారి రాజేశ్ సింగ్ తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవటానికి రెండు బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో దళితులకు, మహిళలకు భద్రత లేదని దళిత, మహిళా సంఘాలు ఆరోపించాయి. శాంతి భద్రతల పరంగా యూపీని చక్కని రాష్ట్రంగా తీర్చి దిద్దామని చెప్తున్న యోగి సర్కారు.. ఇలాంటి దారుణాల పట్ల ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించాయి. ఈ కేసులో నిందితులను త్వరగా పట్టుకొని, కఠినంగా శిక్షించాలనీ, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. దళితులు, మహిళల భద్రత పట్ల ప్రభుత్వం మరింత శ్రద్ధ వహించి, ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సదరు దళిత, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి.

ఎపి, తెలంగాణ అసెంబ్లీ సీట్ల పెంపు కేసు సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపుపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 26 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కె. పురుషోత్తమ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంపునకు పునర్విభజన ప్రక్రియను ప్రారంభించే విధంగా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను మినహాయించి, కొత్తగా ఏర్పడిన జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాలను మాత్రమే డిలిమిటేషన్ చేయడం అసమంజసమైనదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఈ పిటిషన్‌పై కేంద్రం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతి స్పందనలను కూడా సుప్రీంకోర్టు కోరింది. డిలిమిటేషన్ కమిషన్ నోటిఫికేషన్లో రాష్ట్రాలను చేర్చడం,మినహాయించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యతని పేర్కొన్న ఎన్నికల కమిషన్ అఫిడవిట్‌ను న్యాయవాది ప్రస్తావించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా సమాధానం దాఖలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్ వాదనలు వినిపిస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఈ ప్రక్రియ 2026 జనాభా లెక్కల వరకు వేచి ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాత్రికి రాత్రే చేపట్టలేని ఒక భారీ కసరత్తు అని అన్నారు. పిటిషనర్ లేవనెత్తిన జమ్మూ కాశ్మీర్ డీలిమిటేషన్ కేంద్రపాలిత ప్రాంతం విషయంలో జరిగిందని ఎఎస్‌జి పేర్కొన్నారు.

ఇక ఏడాదికి రెండుసార్లు అడ్మిషన్లు

- ద్వైవార్షిక ప్రవేశాలకు యుజిసి ఓకే
- ఉన్నత విద్యాసంస్థలకు గ్రీన్‌సిగ్నల్
- ఈ చర్యతో విద్యా కార్యకలాపాలకు అంతరాయం
- భయాన్ని వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

న్యూఢిల్లీ : దేశంలోని ఉన్నత విద్యా సంస్థలు ఏడాదికి రెండు సార్లు విద్యార్థులను చేర్చుకోవటానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజిసి) అనుమతినిచ్చింది. అయితే, యుజిసి చర్యపై అధ్యాపక లోకం ఆందోళనను వ్యక్తం చేస్తున్నది. ఈ చర్యలతో విద్యా కార్యాకలాపాలకు అంతరాయం కలుగుతుందని భయపడుతున్నది. సదరు ఉన్నత విద్యా నియంత్రణ సంస్థ.. యుజిసి (అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ మంజూరు కోసం కనీస ప్రమాణాల సూచనలు) నిబంధనలను ఈ నెలలో నోటిఫై చేసింది.


యుజిసి చర్య పైన చెప్పినట్టుగా ద్వైవార్షిక ప్రవేశాలకు వీలు కల్పిస్తుంది. ఒక విద్యార్థి ఒకే సమయంలో రెండు యూజీ ప్రోగ్రామ్‌లు, ఏకకాలంలో రెండు పీజీలు చేయొచ్చు. "ద్వైవార్షిక ప్రవేశాలను నిర్వహించటానికి సిద్ధంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలు (హెచ్‌ఈఐలు) ఏడాదికి రెండుసార్లు జులై లేదా ఆగస్టు, జనవరి లేదా ఫిబ్రవరిలో విద్యార్థులను చేర్చుకోవచ్చు" అని నిబంధనలు వివరిస్తున్నాయి. విద్యార్థులు ఉన్నత చదువులు చదవటానికి జాతీయ విద్యా విధానం వెసులుబాటును కల్పిస్తుందని యూజీసీ అధికారి ఒకరు తెలిపారు.

లోతైన అధ్యయనం, సంప్రదింపులు జరగలేదు

యుజిసి అడుగును మాత్రం ఉపాధ్యాయ లోకం తప్పుబడుతున్నది. ది ఇండియన్ నేషనల్ టీచర్స్ కాంగ్రెస్ (ఇంటెక్), అకాడెమిక్స్ ఫర్ యాక్షన్ అండ్ డెవలప్‌మెంట్ లు యూజీసీ చర్యను వ్యతిరేకించాయి. యూజీసీ చర్యతో విద్యా కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఈ కఠినమైన ప్రతిపాదనకు ముందు విశ్వవిద్యాలయాలు, కళాశాలలతో ఎలాంటి తీవ్రమైన అధ్యయనం లేదా సంప్రదింపులు జరగలేదు. ద్వైవార్షిక ప్రవేశాలు ఫ్లెక్సిబులిటీని తెస్తాయనే ఆలోచన కాగితంపై ఆకర్షణీయంగా అనిపించవచ్చు. కానీ, వాస్తవానికి అవి ఉన్నత విద్యా సంస్థల విద్యా చట్రాన్ని తీవ్రంగా అస్థిరపరుస్తాయి" అని ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజధాని కళాశాలలో అధ్యాపకులు, ఇంటెక్ చైర్మెన్ పంకజ్ గార్గ్ అన్నారు. యూజీసీని కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకొని ఉన్నత విద్యా వ్యవస్థను రాజకీయం చేస్తున్నదన్న ఆరోపణలు ఇప్పటికే వినిపిస్తున్న విషయం విదితమే. అధ్యాపక లోకం నుంచి వస్తున్న వ్యతిరేకతను యుజిసి పరిగణలోకి తీసుకుంటుందా అన్నది వేచి చూడాల్సిందేనని విశ్లేషకులు చెప్తున్నారు.

ఆర్థిక, సామాజికాభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

- మారుతున్న కాలానికి తగినట్లుగా కార్యాచరణ
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు



బీజింగ్ : మారుతున్న పరిస్థితులకు తగినట్లుగా మనం కూడా మారాల్సి వుందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బుధవారం పేర్కొన్నారు. అంతర్జాతీయ వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టాల్సి వుందని పిలుపిచ్చారు. వ్యూహాత్మక ప్రాధాన్యతలను అర్థం చేసుకుని, వచ్చే ఐదేళ్ళకు (2026-2030) దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాల్సి వుందని పేర్కొన్నారు.

14వ పంచవర్ష ప్రణాళిక (2021-2025)లో నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేయడానికి చివరి సంవత్సరంలో జరుగుతున్న ప్రయత్నాలను వివరిస్తూ, వచ్చే ఐదేళ్ల కాలానికి రూపొందించాల్సిన కొత్త ప్రణాళికలపై దృష్టి పెడుతూ జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"మహత్తర దేశాన్ని నిర్మించాలనే దృక్పథంతో, జాతీయ పునరుజ్జీవనను క్రమాన్ని మరింత ముందుకు తీసుకెళుతూ ప్రాథమికంగా సోషలిస్టు ఆధునీకరణను సాకారం చేయాలన్న లక్ష్యంపై ప్రణాళిక దృష్టి కేంద్రీకరించాలి." అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. 15వ పంచవర్ష ప్రణాళిక (2026-2030)లో చైనా ఆర్థిక, సామాజికాభివృద్ధిపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు.


మధ్యస్థం నుండి దీర్ఘకాలానికి ఆర్థిక, సామాజిక పురోగతికి కీలకమైన మార్గనిర్దేశక పత్రంగా, చైనా పంచవర్ష ప్రణాళిక వివిధ రంగాల వ్యాప్తంగా ఐదేళ్ళ కాలానికి దేశ సర్వతోముఖ లక్ష్యాలను, ప్రధాన కర్తవ్యాలను, విధానపరమైన దృక్పథాన్ని వివరిస్తోంది.

ఈ క్రమంలో ప్రతి నిర్దిష్ట రంగానికి లక్ష్యాలు, కర్తవ్యాలను నిర్దేశించాల్సి వుంది. ఆ మేరకు సహేతుకమైన రీతిలో చేపట్టాల్సిన చర్యలు, విధానాలను రూపొందించాల్సి వుందని జిన్‌పింగ్ పేర్కొన్నారు.

మనం మన స్వంత వ్యవహారాలను ధృఢంగా నిర్వహించుకుంటూనే ఉన్నత ప్రమాణాలతో కూడిన ప్రారంభాలను విస్తరించడానికి కూడా కట్టుబడి వుండాలని చైనా నేత ఆ సదస్సులో పేర్కొన్నారు. అన్ని రంగాల్లో సమున్నతమైన నాణ్యతతో కూడిన అభివృద్ధిని పెంపొందించాల్సి వుందన్నారు. అభివృద్ధి, భద్రత రెండు అంశాలపై మరింతగా దృష్టి పెట్టాలని కోరారు. ఇందుకు గానూ దేశీయంగా, అలాగే అంతర్జాతీయంగా ఎదురయ్యే ముప్పులు, సవాళ్ళను సమగ్రంగా అంచనా వేసుకోవాల్సి వుందన్నారు. దేశ భద్రతా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇంకా కృషి జరగాలని పిలుపిచ్చారు.

1950ల్లో తొలిసారిగా ప్రారంభించిన పంచవర్ష ప్రణాళిక దేశ సర్వతోముఖాభివృద్ధికి బ్లూ ప్రింట్‌గా పనిచేస్తోంది. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఏకీకృత నాయకత్వం కింద విస్తృత ప్రజాస్వామ్య ప్రాతినిధ్యంతో చక్కటి వ్యవస్థీకృతమైన వ్యవస్థ ద్వారా ఈ విధాన రూపకల్పన జరుగుతుంది.

ఆరు మాసాలకు భూమికి చైనా వ్యోమగాములు



బీజింగ్ : చైనా రోదసీ స్టేషన్‌లో ఆరు మాసాలు గడిపిన అనంతరం ముగ్గురు చైనా వ్యోమగాములు బుధవారం భూమికి చేరుకున్నారు. చైనాలోని ఉత్తర మంగోలియా మారుమూల ప్రాంతంలో గోబి ఎడారికి చిట్టచివరన వ్యోమగాములు ప్రయాణించిన మాడ్యూల్ దిగింది. బలమైన గాలులు వీస్తుండడం, మసకగా వుండడంతో వారు భూమికి తిరిగి రావడం ఒక రోజు ఆలస్యమైంది. ఈ సమయంలో ఆ ఎడారిలో ఇసుక తుపానులు బాగా వస్తుంటాయి. గతేడాది అక్టోబరులో తియాంగాంగ్ రోదసీ స్టేషన్‌కు వెళ్ళిన కాయి జుఝె, సాంగ్ లింగ్‌డాంగ్, వాంగ్ హోజెలు మంగళవారం స్టేషన్ బాధ్యతలను కొత్తగా వచ్చిన సిబ్బందికి అప్పచెప్పి తిరుగుపయనమయ్యారు. ఈ ముగ్గురు వ్యోమగాములు గత ఆరుమాసాల కాలంలో రోదసీ స్టేషన్‌లో అనేక ప్రయోగాలు నిర్వహించారు. వీరిలో కాయి సాంగ్‌లు రోదసీలో 9గంటల పాటు నడిచారు. ప్రపంచంలోనే ఇది అత్యంత సుదీర్ఘమైన నడక అని చైనా రోదసీ సంస్థ వ్యాఖ్యానించింది.

కాంగ్రెస్ కార్యాలయంపై బిజెవైఎం దాడి యత్నం

(మొదటిపేజీ తరువాయి)

కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడానికి సచివాలయానికి వెడుతున్నట్లు ప్రకటించడంతో పోలీసులు మరోసారి ఆమెను అడ్డుకున్నారు. కారులో గన్నవరం విమానాశ్రయానికి తరలించారు. అక్కడి నుండి ఆమె బెంగళూరు వెళ్లారు. అంతకుముందు ఆమె రాజధానికేంద్రం రూ.1.50 లక్షల కోట్లు ఇవ్వాలని, వచ్చే మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఎం ఖండన

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిలను అడ్డుకుని హౌస్ అరెస్టు చేయడాన్ని సిపిఎం ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయునిపాలెం పర్యటనను పోలీసులు అడ్డుకోవడానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో దీక్ష చేస్తున్న షర్మిలపై కోడిగుడ్లతో బిజెపి నాయకులు దాడి చేయడం అప్రజాస్వామికమని ఈ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. 2015లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ శంకుస్థాపన చేసి రాష్ట్రానికి చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి తప్ప నిధులేమీ ఇవ్వని విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమరావతి రాజధాని, మోడీ పర్యటన గురించి ఊదరగొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం షర్మిలను ఎందుకు అడ్డుకున్నారో సమాధానం చెప్పాలని కోరారు. అమరావతి నిర్మాణానికి ఇచ్చిన అప్పులను గ్రాంటుగా ప్రధానమంత్రితో ప్రకటన చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

డిజిటల్ యాక్సిస్‌ప్రాథమిక హక్కు

(మొదటిపేజీ తరువాయి)

సమాజంలోని కొన్ని వర్గాల వారికి మాత్రమే సేవలందించేలా కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో వుండేలా, ఉపయోగించుకునే రీతిలో డిజిటల్ ఎకో వ్యవస్థలను రూపొందించాల్సినస అవసరం చాలా వుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రయాగ ప్రసూన, మరికొందరి నేతృత్వంలోని యాసిడ్ దాడి బాధితుల బృందం, బధిరుడైన అమర్ జైన్ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారించిన కోర్టు తీర్పునిచ్చింది. ఆ సందర్భంగా కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. యాసిడ్ దాడి బాధితులతో పాటు వికలాంగులు డిజిటల్ కెవైసి ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేయడమనేది దాదాపు అసాధ్యమని వారు తమ పిటిషన్లలో పేర్కొన్నారు.

స్క్రీన్‌పై ఇచ్చిన నిర్దిష్ట ఫ్రేమ్‌ల్లో తమ ముఖాలను పెట్టడం, అలాగే తలను అటూఇటూ కదల్చడం, కళ్లు ఆర్పడం వంటి అంశాలు యాసిడ్ దాడికి గురైన వారికి లేదా ముఖంలో అంగవైకల్యంతో బాధపడేవారికి సాధ్యం కాదని జస్టిస్ మహదేవన్ పేర్కొన్నారు. ఫలితంగా వారు తమ గుర్తింపును డిజిటల్‌గా నిర్ధారించలేని పరిస్థితులు నెలకొంటాయన్నారు. దీనివల్ల వారు బ్యాంక్ ఖాతాను తెరవడానికి కూడా చాలా జాప్యం జరుగుతుంటుందన్నారు. అలాగే కీలకమైన సేవలందుకోవడంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోవడానికి కూడా వారు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇలా వికలాంగులకు సహకరించని డిజిటల్ వాతావరణం వుండడంతో ఈ వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని సమాజంలోని ప్రధాన స్రవంతితోకి కలుపుకోవడానికి బదులుగా వారి జీవనాన్ని మరింత సంక్లిష్టం చేస్తున్నారని న్యాయస్థానం పేర్కొంది.

ఈ సమకాలీన శకంలో ముఖ్యమైన సర్వీసులు, పాలన, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక అవకాశాలు ఇవన్నీ కూడా డిజిటల్ వేదికల ద్వారానే ప్రజలకు చేరువవుతున్నాయని జస్టిస్ మహదేవన్ పేర్కొన్నారు. ఈ సాంకేతిక వాస్తవికతల నేపథ్యంలో రాజ్యాంగంలోని 21వ అధికరణ కింద జీవించే హక్కుకు తిరిగి భాష్యం చెప్పాల్సి వుందన్నారు.

డిజిటల్ అంతరాన్ని తగ్గించడమనేది విధానపరమైన విచక్షణ కింద ఇక చూడలేమని, హుందాగా, స్వయంప్రతిపత్తితో, సమాన ప్రాతినిధ్యంతో ప్రజా జీవనంలో గడిపేందుకు రాజ్యాంగబద్ధంగా తప్పనిసరైన అంశంగా మారిందని సుప్రీం కోర్టు పేర్కొంది.

అలాగే గ్రామీణ భారతంలోని ప్రజలు కూడా ఇంటర్‌నెట్ సౌకర్యం సరిగా పొందలేకపోతున్నారని, ప్రాంతీయ భాషల్లో అరకొర సమాచారమే వుంటోందని, దీనివల్ల ఇ-గవర్నెన్స్, సంక్షేమ పథకాలు అటువంటి వారికి అర్థవంతమైన రీతిలో చేరువ కావడం లేదని కోర్టు పేర్కొంది. అందువల్ల ప్రభుత్వ పోర్టల్స్, ఆన్‌లైన్ లెర్నింగ్ వేదికలు, ఆర్థికపరమైన సాంకేతికతలతో సహా డిజిటల్ మౌలిక వసతుల వ్యవస్థ సార్వజనీనంగా అందరికీ అందుబాటులోకి రావాలని, రాజ్యాంగంలోని 21, 14, 38 అధికరణల కింద ఇవి ప్రభుత్వ బాధ్యతలని కోర్టు స్పష్టం చేసింది.

కోల్‌కతాలో భారీ అగ్ని ప్రమాదం

- 14 మంది మృతి
- 13 మందికి గాయాలు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మంగళవారం రాత్రి ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 14 మంది మరణించగా, మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. సెంట్రల్ కోల్‌కతాలోని ఫల్పట్టి మచౌవా సమీపంలోని రితురాజ్ హోటల్‌లో ఈ అగ్ని ప్రమాదం సంభవించింది.

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి సహాయక చర్యలు ప్రారంభించాయి. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి. దాదాపు 10 గంటల తరువాత మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి.

ఈ ఘటనపై కోల్‌కతా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ కుమార్ వర్మ మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి 7.15 గంటల ప్రాంతంలో మంటలు ప్రారంభమైనట్లు తెలిపారు. దీంతో హోటల్‌లో ఉన్న పలువురు భవనం కిటికీలు, ఇరుకైన గోడల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. మరికొంతమంది నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి గాయపడ్డారు. ఈ ప్రమాదంలో 14 మంది మతదేహాలను వెలికి తీశామని.. అనేక మందిని రక్షించినట్లు ఆయన తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చినా, బుధవారం సాయంత్రం వరకూ కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనపై దర్యాప్తు కోసం ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేసినట్లు మనోజ్ కుమార్ తెలిపారు. ఈ భారీ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా వెల్లడి కాలేదని మీడియాకు వెల్లడించారు. అయితే, మరోవైపు షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

రేపే రాజధాని పనుల పున: ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

ఖాజీపేట-విజయవాడ 3వ లైన్, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్టులో బుగ్గనపల్లి, పాణ్యం, లైన్లను ప్రారంభిస్తారు.

భారీగా తరలిరండి : చంద్రబాబు పిలుపు

రాజధాని పనుల పున: ప్రారంభ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి,జనసేన, బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. టిడిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని టిడిపి శ్రేణులతో పాటు జనసేన, బిజెపి కార్యకర్తలు కదలిరావాలని కోరారు. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర విజన్-2047 రూపొందించుకున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే ఎన్‌డిఎ లక్ష్యమని చెప్పారు.గత పాలకులు మూడు రాజధానుల పేరుతో రాజధానిని నిర్వీర్యం చేశారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, యువత ఆకాంక్ష తీరే విధంగా రాజధాని నిర్మాణం ఉంటుందని చెప్పారు. కడపలో మహానాడును ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెలలోనే అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభిస్తామని తెలిపారు.

సింహాచలంలో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

10 రోజుల కిందట మొదలుపెట్టి 3 రోజుల క్రితమే పూర్తిచేసినట్లు తెలుస్తోంది. ఈ హడావిడి నిర్మాణమే ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. దీంతో పాటు, డిజైనింగ్ లోపం ఉందని అంటున్నారు. అవినీతి ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.



మృతుల కుటుంబీకులను ఓదార్చుతున్న హోం మంత్రి అనిత

బాధిత కుటుంబాల వద్దకు ప్రముఖులు...

ఘటనా స్థలం కొండపైకి హోం మంత్రి అనిత హుటాహుటిన వెళ్లారు. ఆమె కెజిహెచ్‌లోని మృతుల కుటుంబాలనూ పరామర్శించి ఓదార్చే ప్రయత్నం చేశారు. జనసేన రాష్ట్ర నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. కెజిహెచ్ వద్ద సిపిఎం విశాఖ జిల్లా నేతల బృందం కె.లోకనాథం, డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి కుమార్, సుబ్బారావు, చంద్రమౌళి తదితరులు వెళ్లి కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

72 గంటల్లో నివేదిక : సిఎం

సింహాచలం ఘటనపై విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ వేస్తున్నామని, విచారించి 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ ఘటనపై సిఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం టెలీకాన్ఫరెన్స్ ద్వారా విశాఖ అధికారులు, మంత్రులతో మాట్లాడారు. అప్పన్న సన్నిధిలో జరిగిన దుర్ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఘటన జరిగిన తీరుపై విచారణకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇఎన్‌సి వెంకటేశ్వరరావుతో కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. ఘటన ఎందుకు జరిగింది, గోడ కూలిపోవడానికి గల కారణాలపై పూర్తిస్థాయి నివేదిక అందించాలని ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. గాయపడిన వారికి మూడు లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆలయాల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధి కల్పించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రులు అనిత, బాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాదు, ఎంపి భరత్, దేవస్థానం ధర్మకర్త అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు.



శైలజ కుటుంబసభ్యులను ఓదార్చుతున్న వైఎస్ జగన్

ఇంత నిర్లక్ష్యమా? : వైఎస్ జగన్

ఈ ఘటనలో మృతిచెందిన నగరంలోని చంద్రంపాలేనికి చెందిన సాఫ్ట్‌వేర్ దంపతుల కుటుంబ సభ్యులను వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన ఆ గ్రామానికి వెళ్లారు. వారిని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ లక్షల మంది వస్తారని అంచనాలు ఉన్నా భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. 'ముందస్తు అంచనాలున్నా ఇంత నిర్లక్ష్యమా..?' అని ఆయన ప్రశ్నించారు. గతంలో తిరుపతి సంఘటన, నేడు సింహాచలం దుర్ఘటన రెండూ ఒకే కోవలోకి వస్తాయన్నారు. వారం రోజుల క్రితం గోడ కట్టడం మొదలు పెట్టి రెండు రోజుల క్రితం పూర్తిచేశారని చెప్పారు. 10 అడుగుల ఎత్తు, 70 అడుగుల వెడల్పు నిర్మాణం చేసినా ఎక్కడా నిబంధనలు పాటించలేదని జగన్ విమర్శించారు.'చందనోత్సవం ఎప్పుడు జరుగుతుందో చంద్రబాబుకు తెలియదా? ఇంత నిర్లక్ష్యమా?' అని అన్నారు. మంత్రులపైనా, దేవస్థానం అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిపిఎం సంతాపం

విశాఖ జిల్లా సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా గోడకూలి ఎనిమిది మంది మరణించడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విడుదల చేసిన ప్రకటనలో మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చనిపోయిన వారిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారుండటం మరింత ఆవేదన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఒక్కొక్కరికీ కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం మృతుల కుటుంబ సభ్యులకు చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, గాయపడిన స్థితిని బట్టి రూ.10 లక్షల వరకూ నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు. ప్రమాదానికి కారణమైన గోడ కట్టి కొద్దికాలమే అయినప్పటికీ కూలడం అంటే నాణ్యత లేదని స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు. గోడకట్టిన కాంట్రాక్టరు, పర్యవేక్షించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

వేసవి విడిది





దొంగలు దొరికారు

వీరవరం ఊరిలో నితిన్, అభిషేక్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. ఒకరోజు రాత్రి ఆ ఊరికి నలుగురు దొంగలు వచ్చారు. నితిన్ వాళ్ల పొరుగింట్లో ఉండే రాంబాబు కుటుంబం ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లారు. దొంగలు, రాంబాబు ఇంట్లోకి దొంగతనం చేద్దామని ప్లాన్ చేశారు. అది చూసిన అభిషేక్, నితిన్ దొంగలు వచ్చారని అందరినీ పిలిచారు. గట్టిగా అరిచారు. వీరి అరుపులు విని దొంగలు పారిపోయారు. ఇంట్లో దొంగలు లేకపోయేసరికి అక్కడికి వచ్చిన ప్రజలు నితిన్, అభిషేక్ అబద్ధము చెప్పారని తిట్టి వెళ్ళారు. నిజం చెప్పినా ఎవరూ నమ్మడం లేదని అన్నదమ్ములిద్దరూ చాలా బాధపడ్డారు.

ఆ తరువాతి రోజు రాత్రి రాంబాబు ఇంటికి మళ్ళీ దొంగలు వచ్చారు. 'ఈసారి దొంగలను కచ్చితంగా పట్టించాలి. నిజాన్ని నిరూపించాలి' అన్నాడు అభిషేక్. దొంగలు రాంబాబు ఇంటి తాళం పగులకొట్టి ఇంట్లోకి వెళ్లారు. నితిన్, అభిషేక్ వాళ్ల వెనకే వెళ్లి తలుపులు మూసి గడియ పెట్టారు.

'దొంగలు, దొంగలు' అని గట్టిగా అరిచారు. ఎవరూ రాలేదు. ఇంటింటికి వెళ్లి తలుపులు కొడుతూ పిలిచారు. కొద్ది సేపటి తర్వాత జనాలు వచ్చారు. ప్రజలు రావడం చూసి దొంగలు పారిపోవాలని ప్రయత్నించారు. అయితే తలుపులు మూసి ఉండడంతో ఇంట్లోనే ఇరుక్కుపోయారు. ఊరి ప్రజలు దొంగలను చూసారు. పోలీసులకు ఫోన్ చేసి, దొంగలను పట్టి అప్పగించారు. పోలీసులు, ప్రజలు నితిన్, అభిషేక్‌ని మెచ్చుకున్నారు. తాము చెప్పిన నిజాన్ని నిరూపించుకున్నందుకు నితిన్, అభిషేక్ సంతోషించారు.



బి.విశ్వ తేజ
ఆరవ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా,
99590 07914.

అనుబంధాలు

అమ్మ మనల్ని కని, పెంచునురా
మంచి బుద్ధులెన్నో నేర్పునురా
నాన్న వేలుపట్టి నడిపించునురా
మన ఎదుగుదలకు తోడ్పడునురా
అక్క, అన్న మనకు ఆదర్శమురా
అందరితో కలిసి ఉండమని చెప్పునురా
చెల్లి, తమ్ముడివి బోసి నవ్వులురా
ప్రేమ చూపుమని చెప్పునురా,
నానమ్మ, తాతయ్యల మురిపెమురా
ఆత్మీయతను ఎంతో పంచునురా
అత్త, మామల మమకారంరా
అనురాగం ఎంతో కురిపించినురా
బావ, మరదలి, వదిన మరిదిల
ముచ్చటరా
అల్లరితో ఎంతో సరదాగా ఉండునురా
కుటుంబ ప్రేమ, అనుబంధాలురా
సమాజంలో గౌరవాన్ని పెంచునురా...



– ఎం. వెంకట
సుప్రజ,
8వ తరగతి,
జి.ప.ఉ.పా.
నర్సింహుల పల్లి,
పెద్దపల్లి.
తెలంగాణ.



నేను గీసిన బొమ్మ





– ఉప్పాడ లిఖిత,
5వ తరగతి,
హరి గోపాల స్కూలు,
రైల్వే న్యూ కాలనీ,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



JEEVANA
జీవన the family

ఉత్సాహంగా.. ఉల్లాసంగా ...

ఒకప్పుడు పిల్లలు ఆటపాటల్లో బాగా గడిపేవారు. ఆటలు బోర్ కొట్టినప్పుడు పుస్తకాలు చదువుకునేవారు. ఇంచుమించు ప్రతి ఇంట్లో చందమామ, బాలమిత్ర, బాలజ్యోతి, బొమ్మరిల్లు, బుజ్జాయి, బాల, జాబిల్లి వంటి పిల్లల పుస్తకాలు ఉండేవి. ఇక పెద్దలు చరిత్ర, నవలలు, కథలు, సినిమా పుస్తకాలు, భారతం, రామాయణం వంటివి పుస్తకాలను చదువుతుండేవారు. పిల్లలకు కూడా చారిత్రక అంశాలు, కథలు వంటివి చెప్పేవారు. పొడుపు కథలు, సామెతలు చెప్పి తిరిగి చెప్పించే వారు. అలా కథలు చదువుతూ పొడుపు కథలు వింటూ పెరిగిన పిల్లలు మానసికంగా బలంగా ఉండేవారు. ఇప్పుడు కంప్యూటర్, వీడియో గేమ్స్ మొబైల్‌గేమ్స్‌తో చిన్నారుల్లో సృజన తగ్గిపోతోంది. పిల్లలు చెడిపోతున్నారని తల్లిదండ్రులు దిగులు పడుతున్నారు. ఇలాంటి పెద్దల దిగులును తీర్చేలా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ వారు పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించటానికి వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహిస్తోంది.


రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా పౌర గ్రంథాలయ శాఖ ద్వారా నిర్వహించబడుతోన్న 1000కిపైగా ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో ఏప్రిల్ 28 నుంచి జూన్ ఆరోతేదీ వరకూ సమ్మర్ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా వేసవి విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయి. కథలు, సృజనాత్మక కృత్యాల్లో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఈ తరగతులు కొనసాగుతున్నాయి. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పర్యవేక్షణలో పౌర గ్రంథాలయ సంస్థ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఈ తరగతులు మొదలయ్యాయి.

విద్య, ఆరోగ్యం, ఇతర వివిధ రంగాలకు సంబంధించిన అనేక పుస్తకాలు లైబ్రరీలో ఉండటంతో బాలలు ఇక్కడికి వచ్చి వాటిని చదువుకుంటున్నారు. అందుబాటులో ఉన్న పుస్తకాలను గ్రంథాలయ సిబ్బంది ఎంతో ఓపిగ్గా అడిగిన వారికి అందజేస్తున్నారు. చిన్న వయస్సులో పిల్లలు ఏదైనా తొందరగా నేర్చుకుంటారు. పఠనాసక్తి పెంపొందించటం, చదవటం, రాయటం, డ్రాయింగ్, సృజనాత్మక అంశాలు ఇలా ఎందులో ప్రోత్సహిస్తే అందులో వారు మెరికలుగా తయారవుతారు. వాళ్లకు ఆటలు, చదువుతో పాటు జీవన నైపుణ్యాలు అలవాటు చేస్తే మంచి భావి భారత పౌరులుగా తయారవుతారు. దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, కృషి కూడా ఉండాలి కూడా.



ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విజ్ఞానకేంద్రాల్లోనూ, బాలోత్సవ కమిటీల ఆధ్వర్యంలోనూ వేసవి శిబిరాలు జరుగుతున్నాయి. పిల్లల మానసిక, శారీరక, సృజనాత్మక వికాసానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆయా శిబిరాల్లో చేర్పించి, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి.

పఠనాసక్తి పెరుగుతోంది



ఉపన్యాసం చెప్పటం, తెలుగు, ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడటం, గణితంలో పోటీలు, తెలుగులో పద్యాలు, హిందీ, ఇంగ్లీషులో అంకెలు, పద్యాలు వంటివి విద్యార్థులకు చెప్పటం, వారితో చెప్పించే ప్రక్రియ కొనసాగుతోంది. జాతీయ నాయకుల జీవిత కథలను చదివిస్తున్నాం. పుస్తకాలు చదివించటం వల్ల పిల్లల్లో మేధో వికాసం పెరుగుతుంది. చిన్నపిల్లల నుండి పెద్దవారి దాకా అందరికీ అవసరమైన ఎన్నో విద్య, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక, చారిత్రక, సైన్స్, ఇంజనీరింగ్, సాహిత్యం, ఆర్థిక రంగాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

- ఎల్.హరికృష్ణ,
మానికొండ బ్రాంచి గ్రంథాలయ అధికారి,
ఉంగుటూరు మండలం, కృష్ణా జిల్లా.

చాలా నేర్చుకుంటున్నాం

గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో మేము పాల్గొంటున్నాం. గ్రంథాయల సిబ్బంది, అధికారులు, శిక్షకులు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలియజేస్తున్నారు. మేము చదివిన కథలను చెప్పటం, తోటి వారు చెప్పేటప్పుడు వినటం ద్వారా వాటిలోని సారాంశాన్ని తెలుసుకుంటున్నాం. తెలుగు, ఇంగ్లీషు, హిందీ బాషలో వాక్యాలు రాయటం, చదవటం వేగంగా చేయగలుగుతున్నాం. పోటీల్లో చురుగ్గా పాల్గొంటున్నాం.

- జి.శాన్, ఎస్‌కె అమీనా, గంటా ప్రత్యూష
తాడేపల్లి గ్రంథాలయం, మంగళగిరి మండలం,
గుంటూరు జిల్లా.


సరికొత్తగా విజ్ఞాన తరగతులు



ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలోని మా శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాం. ఏప్రిల్ 28న ప్రారంభించాం. జూన్ ఆరో తేదీ వరకూ కొనసాగిస్తాం. రోజూ ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకూ కథలు చదివి వినిపిస్తున్నాం. చదవటం మాకిష్టం పేరుతో 8.30 నుంచి 10 గంటల వరకూ పుస్తకాలు చదివిస్తున్నాం. 10.10 నుంచి 11 గంటల వరకూ పుస్తక సమీక్ష, కథలు చెప్పటం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్‌క్రాఫ్ట్, డ్యాన్స్, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్, జికెలతోపాటు ఇండోర్ ఆటలు, జీవన నైపుణ్యాలు వంటివి కూడా నేర్పిస్తున్నాం.

- షేక్ నాగూర్‌భాష,
గ్రంథాలయశాఖాధికారి, తాడేపల్లి.

సృజనాత్మకత పెంపుదలకు దోహదం



రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నాం. అన్ని గ్రంథాలయాల్లో పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం. మంచినీటి వసతి కల్పించాం. ఇండోర్ గేమ్స్ ప్రోత్సహిస్తున్నాం. అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈ తరగతులు కొనసాగుతున్నాయి. ఆటలు, పాటలు, పద్యాలు, కథలు చెప్పటం, స్పెల్లింగ్‌లు చెప్పించటం, చేతిరాత ఇలా అనేక రకాలుగా నిర్వహిస్తున్న పోటీల్లో కూడా విద్యార్థులు చురుగ్గా పాల్గొంటున్నారు.

- గూనుగుంట్ల కోటేశ్వరరావు,
రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్



పహల్గాం మృతులకు నివాళి : టిఎఫ్‌టిసి

పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు సినీ పరిశ్రమలోని 24 శాఖలవారు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 'మా' మాజీ ప్రెసిడెంట్, సీనియర్ నటుడు మురళి మోహన్ కూడా పాల్గొన్నారు. టిఎఫ్‌టిసి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ 'జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్న'ట్లు ప్రకటించారు. తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ కుమార్ మాట్లాడుతూ "బాధితులకు తెలుగు చిత్ర పరిశ్రమ, తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎప్పుడూ అండగా ఉంటుంది' అని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో భరత్ భూషణ్ దామోదర్ ప్రసాద్, అనుపమ రెడ్డి మాదల రవి, వల్లభనేని అనిల్, శ్రీధర్, తుమ్మలపల్లి రామకృష్ణ, మాణిక్, ప్రకాష్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



రజినీకాంత్ సినిమాలో బాలకృష్ణ!

రజినీకాంత్, నెల్సన్ దిలీప్ కుమార్ కాంబోలో వస్తోన్న 'జైలర్-2' చిత్రంలో బాలకృష్ణ కామియో రోల్ చేస్తున్నారని కోలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ పాత్ర కోసం బాలయ్యతో సంప్రదింపులు జరపగా ఆయన ఓకే చేసినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే చిత్రబృందం ప్రకటించే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో వసంత్ రవి, మీర్నా మీనన్, యోగిబాబు, వినాయకన్, శివరాజ్ కుమార్, మోహన్ లాల్ వంటి వారు నటిస్తున్నట్లు సమాచారం.

నేడు 'రెట్రో' విడుదల



తమిళ నిర్మాణ సంస్థ స్టోన్ బెంచ్ క్రియేషన్స్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై కార్తీకేయన్ సంతానం, సూర్య, జ్యోతిక నిర్మాతలుగా నిర్మించిన సినిమా 'రెట్రో'. ఈ సినిమాలో సూర్య, పూజాహెగ్డే, జయరాం, జోజు జార్జ్, కరుణాకరన్, నాజర్, ప్రకాష్‌రాజ్ తదితరులు నటించారు. గురువారం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



'తుడరం' బాక్సాఫీస్ రికార్డు

మలయాళ చిత్రం 'తుడరం' అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీసు వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మోహన్‌లాల్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు చేసిన సినిమాగా రికార్డుకెక్కింది. ఈ సినిమాలో మోహన్‌లాల్, శోభన జంటగా నటించారు. ఎం.రంజిత్ నిర్మాత, తరుణ్‌మూర్తి దర్శకత్వం వహించారు. ప్రకాశ్‌వర్మ, బిను పప్పు, భారతీరాజా, థామస్ మ్యాథ్యూ, సంగీత్ ప్రతాప్, అర్ష చాందిని బైజూ తదితరులు నటించారు. రాజపుత్ర విజువల్ మీడియా బ్యానర్‌పై రూపొందించిన ఈ సినిమా ఏప్రిల్ 25న విడుదలైంది. అప్పటి నుంచి నేటి వరకూ థియేటర్లు పూర్తి ఆక్యుపెన్సీని నమోదు చేస్తున్నాయి. కేరళతోపాటుగా కర్నాటక, ఆంధ్రా, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఓవర్సీస్‌లో భారీగా ఆదరణ లభిస్తోంది.



'హిట్-3' ధరలు పెంపు

నాని నటించిన 'హిట్-3' సినిమా ఈ రోజు రిలీజ్ కాబోతోంది. ఏపీ ప్రభుత్వం చిత్రబృందం అభ్యర్థన మేరకు టికెట్ల రేట్లను పెంచుతూ జీవో విడుదల చేసింది. సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.75 వరకు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. జీఎస్టీతో కలిపి ఈ ధరలను పెంచింది. మూవీ విడుదలైన తేదీ నుంచి వారం వరకు ఈ ధరలు ఉంటాయి. ఆ తర్వాత మామూలు ధరలకే టికెట్లు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. బుధవారం జీవో రావడంతో మూవీ అడ్వాన్స్, బుక్ మై షోలో టికెట్లు ఓపెన్ అయ్యాయి. తెలంగాణలో మాత్రం టికెట్ల రేట్లు పెంచట్లేదు. శైలేష్ కొలను డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో దీన్ని తెరకెక్కించారు.

చాహల్ హ్యాట్రిక్

- శ్రేయస్, ప్రభ్‌సిమ్రన్ అర్ధసెంచరీలు
- చెన్నైపై పంజాబ్ అలవోక విజయం
- ప్లే-ఆఫ్స్ రేసునుంచి సూపర్‌కింగ్ ఔట్

చెన్నై: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18లో తొలి హ్యాట్రిక్ నమోదైంది. చిదంబరం స్టేడియం వేదికగా చెన్నై సూపర్‌కింగ్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ స్పిన్నర్ యజ్ఞేంద్ర చాహల్ హ్యాట్రిక్ వికెట్లతో సత్తా చాటాడు. 18.4వ బంతికి ధోనీని ఔట్ చేసిన చాహల్.. ఆ తర్వాత రెండు బంతులకు దీపక్ హుడా, నూర్ అహ్మద్‌లను ఔట్ చేశాడు. ఈ సీజన్‌లో తొలి హ్యాట్రిక్ సాధించిన బౌలర్‌గా చాహల్ నిలిచాడు. దీంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 19.2ఓవర్లలో 190పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం పంజాబ్ 19.4ఓవర్లలో 6వికెట్లు నష్టపోయి 194పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(72), ప్రభ్‌సిమ్రన్(54) అర్ధసెంచరీలకి తోడు శశాంక్ సింగ్(23) బ్యాటింగ్‌లో రాణించారు. చెన్నై బౌలర్లు పథీరణ, ఖలీల్ అహ్మద్‌కు రెండేసి, జడేజా, నూర్ అహ్మద్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ ఓటమితో ఐదుసార్లు ఐపిఎల్ టైటిల్ విజేత చెన్నై సూపర్‌కింగ్స్ మరో నాలుగు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ప్లే-ఆఫ్స్ రేసునుంచి నిష్క్రమించింది. అంతకుముందు చెన్నై ఓపెనర్లు రషీద్(11), మాత్రే(7), జడేజా(17) నిరాశపరిచారు. దీంతో చెన్నై 48పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సామ్ కర్రన్(88), బ్రెవీస్(32) అద్భుత బ్యాటింగ్‌తో



అలరించారు. వీరిద్దరూ 4వ వికెట్‌కు 78పరుగులు జతచేశారు. ఈ జోడీని అజ్మతుల్లా విడదీశాడు. ఆ తర్వాత సామ్ కర్రన్ లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సాయంతో చెన్నై స్కోర్‌బోర్డును పరుగెత్తించాడు. ఆదుకుంటాడనుకున్న ధోనీ(11), హుడా(2) మరోసారి నిరాశపరిచారు. చెన్నై ఒక దశలో 200పరుగులకు పైగా పరుగులు చేస్తుందని భావించినా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లను చాహల్ వరుస ఓవర్లలో ఔట్ చేయడంతో చెన్నై ఇన్నింగ్స్ 190పరుగులకే ముగిసింది. పంజాబ్ బౌలర్లలో చాహల్‌కు నాలుగు, అర్ష్‌దీప్, జాన్సెన్‌కు రెండేసి, ఒమర్జయ్, హర్‌ప్రీత్ బ్రార్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ సీజన్‌లో చెన్నై జట్టు ఇది ఎనిమిదో ఓటమి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ చాహల్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు...

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రషీద్ (సి)శశాంక్ సింగ్ (బి)అర్ష్‌దీప్ 11, ఆయుష్ మాత్రే (సి)శ్రేయస్ అయ్యర్ (బి)జాన్సెన్ 7, సామ్ కర్రన్ (సి)ఇంగ్లిస్ (బి)జాన్సెన్ 88, జడేజా (సి)ఇంగ్లిస్ (బి)హర్‌ప్రీత్ బ్రార్ 17, బ్రెవీస్ (బి)అజ్మతుల్లా 32, దూబే (సి)శశాంక్ సింగ్ (బి)అర్ష్‌దీప్ 6, ధోనీ (సి)వధేరా (బి)చాహల్ 11, హుడా (సి)ప్రియాన్ష్ ఆర్యా (బి)చాహల్ 2, కంబోజ్ (బి)చాహల్ 0, నూర్ అహ్మద్ (సి)జాన్సెన్ (బి)చాహల్ 0, ఖలీల్ అహ్మద్ (నాటౌట్) 0, అదనం 16. (19.2ఓవర్లలో ఆలౌట్) 190పరుగులు. **వికెట్ల పతనం:** 1/21, 2/22, 3/48, 4/126, 5/172, 6/184, 7/186, 8/186, 9/186, 10/190 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.2-0-25-2, జాన్సెన్ 4-0-30-2, ఒమర్జయ్ 4-0-39-1, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-21-1, చాహల్ 3-0-32-4, సూర్యాంశ్ షిండే 3-0-40-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్యా (సి)ధోని (బి)ఖలీల్ అహ్మద్ 23, ప్రభ్‌సిమ్రన్ (సి)బ్రెవీస్ (బి)నూర్ అహ్మద్ 54, శ్రేయస్ అయ్యర్ (బి)పథీరణ 72, వాథేరా (సి)జడేజా (బి)పథీరణ 5, శశాంక్ సింగ్ (సి)బ్రెవీస్ (బి)జడేజా 23, ఇంగ్లిస్ (నాటౌట్) 6, సూర్యాంశ్ (సి) (బి)ఖలీల్ అహ్మద్ 1, యన్‌సెన్ (నాటౌట్) 4. అదనం 6. (19.4ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 194పరుగులు. **వికెట్ల పతనం:** 1/44, 2/116, 3/136, 4/180, 5/188, 6/190**బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3.4-0-28-2, అన్షుల్ కంబోజ్ 2-0-20-0, జడేజా 3-0-32-1, నూర్ అహ్మద్ 4-0-39-1, సామ్ కర్రన్ 3-0-27-0, పథీరణ 4-0-45-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
బెంగళూరు	10	7	3	0	14	+0.52
పంజాబ్	10	6	3	1	13	+0.27
ముంబయి	10	6	4	0	12	+0.88
గుజరాత్	9	6	3	0	12	+0.74
ఢిల్లీ	10	6	4	0	12	+0.36
లక్నో	10	5	5	0	10	-0.32
కోల్‌కతా	10	4	5	1	9	+0.27
రాజస్తాన్	10	3	7	0	6	-0.34
సన్‌రైజర్స్	9	3	6	0	6	-1.10
చెన్నై	10	2	8	0	4	-1.21

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు

రాజస్తాన్ రాయల్స్ x ముంబయి ఇండియన్స్
వేదిక: జైపూర్; రాత్రి 7.30గం॥లకు

2026 ఆసియా క్రీడల్లోనూ క్రికెట్

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఒలింపిక్ కమిటీ

టోక్యో: 2026లో జపాన్ వేదికగా జరిగే 20వ ఆసియా క్రీడల్లోనూ క్రికెట్‌కు చోటు దక్కింది. ఆర్గనైజింగ్ కమిటీతో భేటి అనంతరం ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా ఈ విషయాన్ని వెల్లడించింది. తదుపరి ఆసియా క్రీడల్లో క్రికెట్‌తో పాటు మిక్సడ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడకు కూడా చోటు లభించింది. టి20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. 14 పురుష జట్లు, 9 మహిళల టీమ్స్ పాల్గొంటాయి. గత ఆసియా క్రీడల్లో టీమిండియా పురుషులు, మహిళల జట్లు స్వర్ణ పతకాలను సాధించింది. ఆసియా క్రీడల్లో క్రికెట్‌ను తొలిసారి 2010లో పరిచయం చేశారు. ఆతర్వాత కేవలం రెండు సార్లు (2014, 2022) మాత్రమే ఆసియా క్రీడల్లో క్రికెట్‌కు అనుమతి లభించింది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడంతో తదుపరి ఆసియా క్రీడల్లో కూడా క్రికెట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ లభించింది. 1900 పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడం ఇదే మొదటిసారి. 2026 ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరుగుతాయి.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68